E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 26-05-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:143|| పేజీలు–6
www.ekaburu.com

గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ పై
హైడ్రా ఫోకస్

జీరో పర్మిషన్ తో భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు
అక్రమ నిర్మాణాల్లో మధ్యవర్తుల లాబీయింగ్
అక్రమ నిర్మాణాలను పరిశీలించిన హైడ్రా - త్వరలో చర్యలు
ఇప్పటికే మున్సిపల్ అధికారుల నోటీసులు
ఎటువంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న నిర్మాణాలు
రెవెన్యూ అధికారిని బదిలీ చేయడం చర్చనీయాంశం
మధ్యవర్తుల లాబీయింగ్‌తో లక్షల్లో డబ్బుల వసూళ్లు
ప్రభుత్వ భూములపై నిర్మాణాలు కొనసాగుతున్నట్లు ఆరోపణ

ఈ-కబురు,శేరిలింగంపల్లి : గోపనపల్లి ఎన్టీఆర్ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలనుసోమవారం హైడ్రా పరిశీలించి, సర్వే చేపట్టడం సంచలనంగా మారింది. ఎన్టీఆర్ నగర్ లో ఎటువంటి అనుమతి లేకుండా జీరో పర్మిషన్ తో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల జాబితాను సిద్ధం చేసిన హైడ్రా త్వరలోనే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే శేరిలింగంపల్లి మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడం, ఎన్టీఆర్ నగర్ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నాడనే కారణంతో ఓ రెవెన్యూ అధికారిని బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు మున్సిపల్, రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తి చూడకుండా కొంతమంది దళారులు లాబీయింగ్ చేసి నిర్మాణదారుల వద్ద భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశారనే చర్చ సాగుతుంది. ఇప్పటికే మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన నిర్మాణదారుల్లో నెలకొంది.

ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే...

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్ పల్లి సర్వే నెంబర్ 124 నేటికి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ స్థలమే. వందల ఎకరాల ఈ భూముల్లో ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్, సోఫా కాలనీలు వెలిశాయి. కొన్నేళ్లుగా వివాదాస్పదంగా ఉన్న ఈ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ఐటీ కారిడార్ కు అనుకొని ఉన్న ఈ ప్రాంత భూములకు రెక్కలు రావడంతో బడాబాబుల చూపు ఈ ప్రాంతంపై పడింది. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులకు డబ్బు ముట్టజెప్పుతూ అక్రమ నిర్మాణాలు చేపట్టసాగారు. ఎటువంటి అనుమతి లేకుండా జీరో పర్మిషన్ తో ఏకంగా ఏడంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నారు.

మిగతా2లో

మహిళా సూపర్ బజార్లు

- స్వయం సహాయక సంఘాలకు రైస్ మిల్లులు, లాజిస్టిక్స్ హబ్‌లు, గోదాముల నిర్మాణ బాధ్యత
- వారికి నామమాత్రపు లీజుతో వంద ఎకరాల వరకైనా అప్పగిస్తాం
- అతివల అండతో మళ్లీ అధికారంలోకి వస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 8,000 గ్రామ మహిళా సంఘాల భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన

ఈ-కబురు, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్‌లను ఏర్పాటు చేయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 సూపర్ బజార్‌లకు నామమాత్రపు లీజుపై స్థలాలను కేటాయిస్తామన్నారు.

02

గుణపాఠాలు నేర్చుకోకపోవడం
విచారకరం

- నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో ఎన్‌టీఏపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- పర్యవేక్షణ కమిటీ సిఫార్సులేమయ్యాయని నిలదీత

03

ఈకబురు, దిల్లీ: వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ ప్రశ్నపత్రం పదే పదే లీకవుతున్నా దానికి అడ్డుకట్టవేసేలా తగు చర్యలు తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వైఫల్యాల నుంచి జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గుణపాఠాలు నేర్చుకోవడంలేదంటూ జస్టిస్

రైతు గోస పట్టదా?

రైతుల ఇబ్బందులు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి
'రైతుగోస– బీజేపీ భరోసా'లో రాంచందర్‌రావు

02

పద్మోత్సవం
తొలి విడతలో 66 మందికి పద్మ అవార్డుల ప్రదానం

- ధర్మేంద్ర తరపున పద్మ విభూషణ్ అందుకున్న హేమమాలిని
- 'పద్మశ్రీ'లు స్వీకరించిన తెలుగు ప్రముఖులు

02

ఈకబురు, దిల్లీ: వివిధ రంగాల్లో విశేష సేవలందించేవారికి ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'పద్మ' అవార్డుల తొలి విడత ప్రదానోత్సవం సోమవారం రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 66 మంది.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. వీరిలో ఇద్దరు పద్మ విభూషణ్, ఆరుగురు పద్మభూషణ్, 58 మంది పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఉన్నారు.

అధికారంలోకి రాగానే
24 గంటలూ తాగునీటి సరఫరా

- హైదరాబాద్‌తోనే నిరంతర నీటి సరఫరా ప్రారంభం
- పేదల ఇళ్ల కూల్చివేతలపై కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు
- హైడ్రా పేరుతో పేదలను భయపెడుతున్నారని ఆరోపణ
- ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలన్న కేటీఆర్
- ప్రజా సమస్యలు పరిష్కరించే వారికే కార్పొరేషన్ టికెట్లు: బీఆర్ఎస్ నేతలు

03

మెట్రోకు భారీ ఊరట

పాత అప్పులకు ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రూ.13,527 కోట్ల రీఫైనాన్సింగ్
దిల్లీలో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం
తగ్గనున్న వడ్డీ భారం

02

మళ్లీ పెట్రో మోత

- పెట్రోలుపై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు
- 10 రోజుల్లో లీటరుపై రాష్ట్రంలో రూ.8.23, రూ.8.12 చొప్పున పెరుగుదల
- రాష్ట్ర ప్రజలపై ఏడాదికి రూ.3,877 కోట్ల భారం

ఈకబురు,దిల్లీ,హైదరాబాద్: దేశంలో మళ్లీ పెట్రో మోత మోగింది. పెట్రోలుపై లీటరుకు రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంచుతూ కేంద్ర ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చాయి. దేశంలో ఈ నెల 15 నుంచి పెట్రో ధరలు పెరగడం ఇది నాలుగోసారి. పెట్రోలియం డీలర్ల సంఘం గణాంకాల ప్రకారం.. తాజా పెంపుతో 10 రోజుల్లో రాష్ట్రంలో పెట్రోలుపై లీటరుకు రూ.8.23, డీజిల్‌పై రూ.8.12 పెరిగింది.

మిగతా4లో

ప్రపంచ విపణికి
ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు

- సైనింగ్-గ్రౌండింగ్-ఓపెనింగ్ విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం
- ప్రతీ రంగంలోనూ ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి అవకాశాలు

మిగతా4లో

కర్ణాటక సరిహద్దులో.. 2 బ్రిడ్జి కమ్ బరాజ్‌లు!

04

'కాలుష్యరహిత గోదావరిపుష్కరాలు'

- గోదావరిలో కలిసే కాలుష్య జలాలపై సమగ్ర ఆడిట్ చేపట్టాలి
- నిజాయతీగా కాలుష్య నివారణలో పనులు చేద్దాం
- సమస్య ఎక్కడుందో తెలుసుకుంటే ఆచరణ సులభం అవుతుంది
- ఆంధ్ర పేపర్ మిల్స్ వ్యర్థజలాల నిర్వహణకు వేగంగా ప్రత్యామ్నాయం అవసరం

04

మెట్రోకు భారీ ఊరట

ఈకబురు, దిల్లీ, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టుకు రుణ వడ్డీ భారం నుంచి భారీ ఊరట లభించింది. తక్కువ వడ్డీకి రీఫైనాన్సింగ్ చేసేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్సీ).. ఎల్అండ్టీ మెట్రో రైలు(హైదరాబాద్) లిమిటెడ్ మధ్య రూ.13,527 కోట్ల భారీ టర్మ్ లోన్ ఒప్పందం కుదిరింది. దిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఐఆర్ఎఫ్సీ సీఎండీ, సీఈవో మనోజ్కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఐఆర్ఎఫ్సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్కుమార్ గోయల్, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్అండ్టీ మెట్రో రైలు(హైదరాబాద్) లిమిటెడ్ ఎండీ కేవీబీ రెడ్డి త్రైపాక్షిక ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో 20 ఏళ్ల కాలవ్యవధికి కుదిరిన రుణ ఒప్పందమిది. ఐఆర్ఎఫ్సీ నుంచి తీసుకున్న రుణాన్ని త్రైమాసిక వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రాసెసింగ్, ఇతర ఛార్జీలు ఉండవు.

వడ్డీ భారం నుంచి విముక్తి..

హైదరాబాద్ మెట్రో మొదటి దశను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)లో నిర్మించారు. ఎల్అండ్టీ మెట్రోరైలు(హైదరాబాద్) లిమిటెడ్.. మెట్రోను నిర్మించి.. నిర్వహించింది. నిర్మాణం కోసం మూలధన పెట్టుబడి(ఈక్విటీ)తో పాటు బ్యాంకుల కన్సార్షియం నుంచి భారీ ఎత్తున రుణాలు తీసుకుంది. ఈ రుణాలకు ఎల్అండ్టీ హామీ ఇచ్చింది. అయితే, మెట్రో రైలు రెండో దశ విస్తరణకు ఆటంకాలు తొలగించేందుకు రూ.15 వేల కోట్లకు మొదటి దశ ప్రాజెక్టులో వంద శాతం వాటా కొనుగోలుకు రాష్ట్ర సర్కారు గత ఏడాది నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గత నెల 29న ఎల్అండ్టీతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీంతో ప్రాజెక్టు సర్కారు పరమైంది. ఒప్పందం ప్రకారం ఈక్విటీ రూ.1461.57 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఎల్అండ్టీకి చెల్లిస్తుంది. రుణాలు సర్కారుకు బదిలీ అయ్యాయి. అయితే, ఈ పాత రుణాల వడ్డీ రేట్లు గరిష్ఠంగా 9.5 శాతం వరకు ఉన్నాయి. వడ్డీ భారం తగ్గించుకునేందుకు ఐఆర్ఎఫ్సీ నుంచి వార్షికంగా 3.5 శాతం వడ్డీకి రుణం తీసుకునేందుకు తాజా ఒప్పందం దోహదం చేస్తుంది. గతంలో తీసుకున్న రుణాలు.. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు(ఎన్సీడీ), కమర్షియల్ పేపర్లు, ఇతర టర్మ్ రుణాలను ఐఆర్ఎఫ్సీ ఇచ్చే రుణంతో తీర్చేయడానికి ప్రస్తుత ఒప్పందం వీలు కల్పిస్తుంది. పాత రుణాల సాఫీ చెల్లింపుతో.. ప్రాజెక్టు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం పెరగనుంది.

మెట్రోకు ఆర్థిక ఉపశమనమిది..

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్లో సమర్థ, సుస్థిర ప్రజారవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి అనుగుణంగా మెట్రో విస్తరణ అత్యంత ఆవశ్యకమని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతోపాటు జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో మెట్రో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పాత రుణాల రీఫైనాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టుకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని చెప్పారు. ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్సీ, ఎల్అండ్టీ, హెచ్ఎంఆర్ఎల్, సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఐఆర్ఎఫ్సీ సీఎండీ మనోజ్కుమార్ దూబే మాట్లాడుతూ.. పట్టణ మౌలిక సదుపాయాలకు దేశీయంగానే భారీ నిధులు సమకూర్చవచ్చని ఈ లావాదేవీ నిరూపించిందన్నారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రాయోజిత పథకాల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్కుమార్సింగ్, హెచ్ఎంఆర్ఎల్ జేఎండీ శివేంద్రప్రతాప్, ఎల్అండ్టీ మెట్రోరైలు(హైదరాబాద్) సీఎఫ్వో ఎ.వి.ఆర్. శ్రీనివాసశర్మ, ఐఆర్ఎఫ్సీ, హెచ్ఎంఆర్ఎల్ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతు గోస పట్టదా?

ఈకబురు, హైదరాబాద్/కుల్కచర్ల/గజ్వేల్: కాంగ్రెస్ పార్టీకి రైతుల గోస పట్టడం లేదని, పండించిన పంటను అమ్ముకోలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్రావు అన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో సోమవారం 'రైతుగోస- బీజేపీ భరోసా' కార్యక్రమాన్ని ప్రారంభించి, మార్కెట్ యార్డులోని రైతులతో మాట్లాడారు. ఆ తర్వాత సిద్దిపేట జిల్లా గజ్వేల్ మార్కెట్ యార్డును కూడా సందర్శించి రైతులతో మాట్లాడారు. వరంగల్లో ఇచ్చిన డిక్లరేషన్ను కాంగ్రెస్ ఏనాడో మర్చిపోయిందన్నారు. రియల్ఎస్టేట్ దందా తప్ప క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎలా జరుగుతుందో సీఎంకు తెలియదన్నారు. ఇప్పటి వరకు ఆయా జిల్లాల వారీగా ఎంతమేర ధాన్యం సేకరించారో శ్వేతపత్రం విడుదల చేయాలని రాంచందర్రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 45 లక్షల టన్నులు సేకరించామని సీఎం పేర్కొంటున్నారని తెలిపారు. ఈ లెక్కన కూడా 30 శాతం మించలేదని మండిపడ్డారు. బీజేపీ శాసనసభా పక్షనేత మహేశ్వర్రెడ్డి మాట్లాడుతూ కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కాకుండానే, వారంలో కేంద్రాలను మూసేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని మండిపడ్డారు. అలా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మెదక్ ఎంపీ రఘునందన్రావు మాట్లాడుతూ బీజేపీ బస్సు యాత్ర వస్తుందని తెలిసి... కలెక్టర్ ఆదివారం గజ్వేల్ మార్కెట్ యార్డుకు ఆగమేఘాల మీద చేరుకొని లారీలు , గన్నీ బ్యాగులు తెప్పించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఇదే ప్రయత్నం నిరంతరంగా ఎందుకు సాగటం లేదని ప్రశ్నించారు.

పార్టీ కార్యాలయం నుంచి ఐక్యత చాటుతూ...

పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్రెడ్డి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలనకు ఐక్యతను చాటుతూ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు బస్సులో బయలుదేరారు. ఈ బస్సు యాత్రలో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్రెడ్డి, ఎం.రఘునందన్రావు, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, పైడి రాకేశ్రెడ్డి, ధన్పాల్ సూర్యానారాయణగుప్తా, డా.పాల్వాయి హరీశ్బాబు, ఎమ్మెల్సీలు ఏవీఎన్రెడ్డి, డా.సి.చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు. మంగళ, బుధవారాల్లో ఉమ్మడి నల్లగొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల తీరును బీజేపీ ప్రతినిధి బృందం సమీక్షించనుంది.

గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ పై హైడ్రా ఫోకస్

ఈ-కబురు,శేరిలింగంపల్లి :

గోపనపల్లి ఎన్టీఆర్ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలనుసోమవారం హైడ్రా పరిశీలించి, సర్వే చేపట్టడం సంచలనంగా మారింది. ఎన్టీఆర్ నగర్ లో ఎటువంటి అనుమతి లేకుండా జీరో పర్మిషన్ తో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల జాబితాను సిద్ధం చేసిన హైడ్రా త్వరలోనే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే శేరిలింగంపల్లి మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడం, ఎన్టీఆర్ నగర్ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నాడనే కారణంతో ఓ రెవెన్యూ అధికారిని బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు మున్సిపల్, రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తి చూడకుండా కొంతమంది దళారులు లాబీయింగ్ చేసి నిర్మాణదారుల వద్ద భారీ ఎత్తున డబ్బులు వసూలు చేశారనే చర్చ సాగుతుంది. ఇప్పటికే మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేస్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన నిర్మాణదారుల్లో నెలకొంది.

ఎన్టీఆర్ నగర్ లో ఎటువంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

ప్రధాన రహదారికి అనుకొని కొనసాగుతున్న భారీ నిర్మాణం

కనీస సెట్ బ్యాక్ లేకుండా రోడ్డును ఆక్రమించి కొనసాగుతున్న భవనం

రహదారిపై రాకపోకలకు అడ్డుగా నిర్మాణ సామగ్రి

ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే...

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్ పల్లి సర్వే నెంబర్ 124 నేటికి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ స్థలమే. వందల ఎకరాల ఈ భూముల్లో ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్, సోఫా కాలనీలు వెలిశాయి. కొన్నేళ్లుగా వివాదాస్పదంగా ఉన్న ఈ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలకు అనుమతి లేదు. ఐటీ కారిడార్ కు అనుకొని ఉన్న ఈ ప్రాంత భూములకు రెక్కలు రావడంతో బడాబాబుల చూపు ఈ ప్రాంతంపై పడింది. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులకు డబ్బు ముట్టజెప్పుతూ అక్రమ నిర్మాణాలు చేపట్టసాగారు. ఎటువంటి అనుమతి లేకుండా జీరో పర్మిషన్ తో ఏకంగా ఏడంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నారు.

హైడ్రా ఫోకస్ - త్వరలో కూల్చివేతలు...

కాగా గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల మీద ఫిర్యాదులు అందుకున్న హైడ్రా అధికారులు సోమవారం ఎన్టీఆర్ నగర్ లో పర్యటించారు. జీరో పర్మిషన్ తో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న భవనాలను చూసి విస్మయం వ్యక్తం చేసిన హైడ్రా అధికారులు మొత్తం భవనాల మీద సర్వే నిర్వహించారు. వెంటనే అక్రమ భవనాల పనులను నిలిపివేయాలని ఆదేశించడంతో పాటు భవనాలకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. అందుకు అనుగుణంగా దాదాపు 20 భవనాలకు నోటీసులు సిద్ధం చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు కొన్నింటికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే ఎన్టీఆర్ నగర్ అక్రమ నిర్మాణాల్లో భవన యజమానులతో లాలూచీ పడిన రెవెన్యూ అధికారిని బదిలీ చేయడంతో పాటు హైడ్రా సర్వే, టౌన్ ప్లానింగ్ నోటీసులతో త్వరలో ఎన్టీఆర్ నగర్ లో భారీ కూల్చివేతలు చేపట్టనున్నట్లు తెలుస్తుంది.

మధ్యవర్తుల లాబీయింగ్...

గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ అక్రమ నిర్మాణాల్లో మధ్యవర్తుల లాబీయింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. అక్రమ నిర్మాణాల వైపు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకుండా ఒక్కో భవనానికి అంతస్థుకు ఒక రేటు లెక్క లక్షల్లో మధ్యవర్తులు వసూలు చేస్తున్నారు. వీరు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖల్లో కొందరు అధికారులకు భవనానికి ఒక రేటు ముట్టజెప్పి అక్రమ నిర్మాణాలను ఏ ఆటంకం లేకుండా పూర్తి చేస్తున్నారు. ఈ విధంగా ఎన్టీఆర్ నగర్ లో చేపడుతున్న ఒక్కో భవనంలో లక్షల రూపాయలు చేతులు మారుతుంది.

మహిళా సూపర్ బజార్లు

ఈకబురు, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లను ఏర్పాటు చేయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రకటించారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 సూపర్ బజార్లకు నామమాత్రపు లీజుపై స్థలాలను కేటాయిస్తామన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే రైస్మిల్లులు, లాజిస్టిక్స్ హబ్లు, గోదాముల నిర్మాణం చేయిస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వ భూములను కేటాయిస్తామని, సున్నా వడ్డీతో బ్యాంకు రుణాలను మంజూరు చేయిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,000 మహిళా సంఘాల భవనాలకు సోమవారం సచివాలయం నుంచి సీఎం వర్చువల్గా శంకుస్థాపన చేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్లో మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇకపై రైస్ మిల్లుల గోడౌన్లలో ధాన్యం నిల్వలు పెట్టబోమని, మహిళా సంఘాలే వడ్లు కొనుగోలు చేసి ప్రభుత్వానికి బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2034 నాటికి కోటిమందిమహిళలను కోటీశ్వరులుగా చేస్తామని పునరుద్ఘాటించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే...

ఇది దేశంలోనే సంచలనం...

''మహిళలు స్వశక్తితో నిర్వహిస్తున్న వ్యాపారాలను వారి సొంత భవనాల నుంచే కొనసాగించేందుకు 8,000 భవనాలను ఒకే రోజు, ఒకే సమయంలో ప్రారంభించుకునే అద్భుత కార్యక్రమమిది. ఇది దేశంలోనే సంచలనం. మహిళా సంఘాలకు సొంత భవనాలు ఉండటం అంటే సమావేశాలకు స్థలం ఇవ్వడం మాత్రమే కాదు. వారి ఆర్థిక కార్యకలాపాలకు, శిక్షణకు, వ్యాపార ప్రణాళికలకు శాశ్వత వేదికను సమకూర్చడం. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజాప్రభుత్వం మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలపాలన్న సంకల్పంతో ముందుకు సాగుతోంది. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. ఉచిత ప్రయాణంతో నష్టం జరుగుతోందని ఆటోల, రిక్షాల కార్మికులను రెచ్చగొట్టి కొన్ని కార్యక్రమాలు చేయించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తిప్పికొట్టి బస్సులో ఉచిత ప్రయాణ పథకాన్ని కొనసాగించాం. ఈ మహాలక్ష్మి పథకం కోసం ఆర్టీసీకి ఉప ముఖ్యమంత్రి భట్టి... 29 నెలల్లోనే రూ.10 వేల కోట్లకుపైగా చెల్లించారు. బస్సులకు మహిళల్నే యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను సంఘాలతో కొనుగోలు చేయించి... ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాం. ఒక్కో బస్సుకు వారికి ప్రతినెలా రూ.70 వేల అద్దె వస్తోంది. కొత్తగా 553 బస్సులను వచ్చే నెల 5న ప్రారంభిస్తాం.

అంబానీ, అదానీలతో పోటీగా...

వ్యాపార దక్షలో మా ఆడబిడ్డలు అదానీ, అంబానీలతో పోటీ పడాలనే ఆలోచనతో వేయి మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టులను వారికి కేటాయించాం. జిల్లా కేంద్రాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో మహిళలతో బంక్లను ఏర్పాటు చేయిస్తున్నాం. ఇప్పటికే ప్రారంభమైన బంక్ల ద్వారా వారు నెలకు రూ.45 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించింది. వడ్డీ లేని రుణాలకు రూ.1,390 కోట్లను చెల్లించింది. తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తున్న మహిళలకు మరింత చేయూతనిచ్చేందుకు రూ.5 లక్షల వరకున్న రుణాలను రూ.10 లక్షలకు పెంచుతున్నాం.

పెద్ద వ్యాపారాల్లోకి ఆడబిడ్డలు

మహిళా సంఘాలు ఇకపై పెద్ద వ్యాపారాల్లోకి రావాలి. వారు రైస్ మిల్లులు, మండల స్థాయిలో గోదాములు, లాజిస్టిక్స్ పార్కులు నిర్మించుకోవాలి. వాటికి అవసరమైన చోట 20, 30 ఎకరాలు... అవసరమైతే 100 ఎకరాల వరకు భూములతోపాటు బ్యాంక్ రుణాలను ఇప్పించే బాధ్యత తీసుకుంటా.

ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్ వ్యవస్థలో మహిళా సంఘాల పాత్ర పెరగాలి. ప్రస్తుతం కొందరు దళారులు, మరికొందరు మిల్లర్లు ప్రభుత్వాలను మోసం చేస్తున్నారు. మనం వడ్లు ఇస్తే అమ్మేసుకుని అసలును వెనక్కి చెల్లించడం లేదు. ప్రభుత్వానికి రూ.వేల కోట్ల నష్టం వస్తోంది. భవిష్యత్తులో ఏ మిల్లులోనూ మన బియ్యం, వడ్లను స్టాక్ పెట్టేదే లేదు. ఆడబిడ్డలకిస్తే ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారు. మహిళా సంఘాలే వడ్లుకొని ప్రభుత్వానికి బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. వారి చేతుల్లోకి ఈ వ్యవస్థ వెళ్తే పారదర్శకత, బాధ్యత పెరుగుతుంది.

కార్పొరేట్ తరహా సూపర్ బజార్లు...

మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు నెలకొల్పాలి. అవి దేశంలోనే ఉత్తమమైనవిగా ఉండాలి. నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలని, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ దొరకాలని, తద్వారా మహిళాసంఘాలకు ఆదాయం రావాలన్నదే ఈ ఆలోచన వెనుకున్న లక్ష్యం. ప్రభుత్వం కూడా మహిళాశక్తి సూపర్ బజార్లలో వాటాదారుగాఉంటుంది. పట్టణాల్లో వీటి ఏర్పాటుకు తక్కువధరకు స్థలాలు లీజుకిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

మళ్లీ అధికారంలోకి తెచ్చే శక్తి ఉంది

మహిళా వారోత్సవాల్లో భాగంగా పట్టణాల్లోని మహిళలకు ఉచితంగా చిలకపచ్చరంగు చీరలను పంపిణీ చేస్తాం. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన చీరలు పొలాల్లో పిట్టలను కొట్టడానికి వాడారు. ప్రజాప్రభుత్వం ఆడబిడ్డకు సారెలాగా ఇందిరమ్మ చీరలను అందజేసింది. మా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చే శక్తి మహిళలకు ఉంది. వారు ఆర్థికంగా బలంగా ఉంటే కుటుంబం .. తద్వారా గ్రామం బలపడుతుంది. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది'' అని సీఎం అన్నారు.

చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలు

మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్లు

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాప్రభుత్వం ఆది నుంచి మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ పథకాలతోపాటు రాజకీయాలు ఇతర రంగాల్లోనూ వారికి అవకాశాలు కల్పిస్తున్నాం. మహిళా సంఘాలకు ఏడాదికి రూ.20 వేల కోట్లు ఇస్తామన్నాం. కానీ, రెండున్నరేళ్లలోనే రూ.60 వేల కోట్లు ఇచ్చాం. గతంలో మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకే వడ్డీలేని రుణాలు వచ్చేవి. మా ప్రభుత్వం వాటిని రూ.10 లక్షలకు పెంచింది. వచ్చే రెండున్నరేళ్లతో కలిపి ఐదేళ్లలో మహిళా సంఘాల రుణాల మొత్తం రూ.1.25 లక్షల కోట్లకు చేరేలా ప్రణాళిక రూపొందించాం. సీఎం ఆదేశాలతో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు నిర్దిష్టలక్ష్యాలతో క్యాలెండర్ను రూపొందించాం. మహిళా సంఘాల సభ్యులందరూ ఈ పథకాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా మరింత పైపైకి ఎదగాలి.

మహిళాసాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం గొప్ప నిర్ణయాలు తీసుకుంటోంది. వారి జీవితాల్లో స్థిరమైన మార్పు తెచ్చేందుకు సీఎం, మంత్రివర్గ సహచరులుగా శ్రమిస్తున్నాం. మహిళలకు కొత్త అవకాశాలు కల్పిస్తూ వ్యాపారాల్లో ముందుకు సాగేందుకు ప్రోత్సహిస్తున్నాం. ఈరోజు వందకుపైగా మహిళా సమాఖ్య భవనాలు ప్రారంభించాం. మిగిలినవాటికి శంకుస్థాపనలయ్యాయి.

పద్మోత్సవం

తొలి విడతలో 66 మందికి పద్మ అవార్డుల ప్రదానం

ఈకబురు, దిల్లీ: వివిధ రంగాల్లో విశేష సేవలందించేవారికి ఇచ్చే ప్రతిష్ఠాత్మక 'పద్మ' అవార్డుల తొలి విడత ప్రదానోత్సవం సోమవారం రాష్ట్రపతి భవన్లోని గణతంత్ర మండపంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 66 మంది.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. వీరిలో ఇద్దరు పద్మవిభూషణ్, ఆరుగురు పద్మభూషణ్, 58 మంది పద్మశ్రీ అవార్డు గ్రహీతలు ఉన్నారు. భారత చలనచిత్ర రంగానికి విశేష సేవలు అందించిన బాలీవుడ్ నటుడు ధర్మేంద్రకు మరణానంతరం ప్రకటించిన పద్మవిభూషణ్ పురస్కారాన్ని ఆయన సతీమణి హేమమాలిని స్వీకరించారు. శాస్త్రీయ సంగీతకారిణి, వయొలిన్ విద్వాంసురాలు ఎన్.రాజం... పద్మ విభూషణ్ పురస్కారాన్ని ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. పద్మభూషణ్ అవార్డు స్వీకరించిన వారిలో ఉత్తరాఖండ్ మాజీ సీఎం భగత్ సింగ్ కోశ్యారీ, శతావధాని ఆర్.గణేశ్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ సురేశ్ కుమార్ కోటక్, జీర్ణ కోశ వ్యాధి నిపుణుడు కల్లిపట్టి రామస్వామి పళనిస్వామి ఉన్నారు. ప్రసిద్ధ వాణిజ్య ప్రకటనల రూపకర్త పీయూష్ పాండే, మాజీ ఎంపీ విజయ్ కుమార్ మల్హోత్రాలకు మరణానంతరం పద్మ భూషణ్ అవార్డులను ప్రకటించారు. పీయూష్ తరఫున ఆయన భార్య, మల్హోత్రా తరఫున ఆయన కుమారుడు స్వీకరించారు.

తెలుగు వెలుగులు

రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ అవార్డులు అందుకున్న తెలుగువారిలో యూజీసీ మాజీ ఛైర్మన్, జాతీయ నూతన విద్యావిధానం 2020 రివ్యూ కమిటీ ఛైర్మన్ మామిడాల జగదీష్కుమార్, అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన ద్వారా ప్రపంచవ్యాప్తంగా అశేష అభిమానాన్ని సంపాదించుకున్న గాయకులు స్వర్గీయ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ తరఫున ఆయన కుమారుడు అనిల్ కుమార్, హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రుల డైరెక్టర్, ప్రముఖ జీర్ణకోశవ్యాధినిపుణుడు డాక్టర్ గూడూరు వెంకట్రావు, ప్రముఖ శాస్త్రీయ నృత్యకళాకారిణి దీపికారెడ్డి, ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు, అపోలో క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పాలకొండ విజయానందరెడ్డి, ప్రఖ్యాత సంస్కృత పండితులు, అద్వైత వేదాంతాన్ని ప్రపంచవ్యాప్తం చేయడానికి ప్రయత్నిస్తున్న విద్యావేత్త, కాంచీపురం శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయం కులపతి ప్రొఫెసర్ వెంపటి కుటుంబశాస్త్రి ఉన్నారు. భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్, నటుడు ప్రసేన్జీత్ ఛటర్జీ, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్పీఎఫ్) మాజీ డైరెక్టర్ జనరల్ కె.విజయ్కుమార్లు పద్మశ్రీ అవార్డులు అందుకున్నవారిలో ఉన్నారు.

విభిన్నరంగాల్లో నిరుపమానమైన సేవలు అందించిన 131 మందికి కేంద్రం.. 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా పద్మ అవార్డులు ప్రకటించిన సంగతి తెలిసిందే. అవార్డు స్వీకర్తలంతా రాష్ట్రపతి నుంచి వాటిని అందుకోవడానికి వెళుతూ ముందువరుసలో కూర్చున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇతర కేంద్ర మంత్రులకు గౌరవపూర్వకంగా నమస్కరించారు. అయితే పుదుచ్చేరికి చెందిన క్రీడాకారుడు పజానివేల్ మాత్రం ప్రధానికి సాష్టాంగ ప్రమాణం చేశారు. దీంతో మోదీ తన సీట్లోంచి లేచి ఆయన వద్దకు వచ్చి ప్రతి నమస్కరించారు. తర్వాత పజానివేల్ అవార్డు స్వీకరించేముందు రాష్ట్రపతి పాదాలకు నమస్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర హోంమంత్రి అమిత్షా, కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, గజేంద్రసింగ్ షెకావత్, హెచ్డీ కుమారస్వామితోపాటు పలువురు పాల్గొన్నారు.

గీతం కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీని సత్కరించిన

తెలంగాణ పోలీసు అకాడమీ

- గీతం కౌటిల్యా తరపున మెమెంటో అందుకున్న రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ

ఈ కబురు, పటాన్ చెరు :వృత్తిపరమైన శిక్షణ, ప్రజా సేవ రంగాలలో 40 ఏళ్ల ఘనమైన సేవను పూర్తిచేసుకున్న సందర్భంగా, రాజా బహదూర్ వెంకట రామరెడ్డి తెలంగాణ పోలీసు అకాడమీ (ఆర్బీవీఆర్ఆర్ టీజీపీఏ) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కె.ఎస్.పి.పి.)ని ఒక స్మారక చిహ్నంతో సత్కరించింది.హైదరాబాదులోని తెలంగాణ పోలీసు అకాడమీ ప్రాంగణంలో జరిగిన ఒక అధికారిక కార్యక్రమంలో, తెలంగాణ గౌరవ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ఈ స్మారక చిహ్నాన్ని గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్, పూర్వ సంచాలకుడు పి.ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు అకాడమీ తాము కొనసాగిస్తున్న విద్యాపరమైన సహకారాలు, సంస్థాగత భాగస్వామ్యాలను గుర్తించి, యునిసెఫ్, ఐఐటీ హైదరాబాదు, జేఎన్టీయూ

హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతనిధులు

తెల్లాపూర్ చెరువులను

పరిరక్షించండి

హైడ్రా కమీషనర్‌ను కోరిన తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు

ఈ–కబురు, పటాన్‌చెరు : సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ జీహెచ్ఎంసీ డివిజన్ పరిధిలోని చెరువులు కాలుష్యం, ఆక్రమణలకు గురై దయనీయ స్థితికి చేరుకున్నాయని, వెంటనే అధికారులు స్పందించి తెల్లాపూర్‌లోని చెరువులను పరిరక్షించాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీల అభివృద్ధి కోసం ఏర్పాటైన నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైడ్రా కమీషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ తెల్లాపూర్‌లోని వనం చెరువు, మేళ్ల చెరువు, చెలికుంట చెరువులు పూర్తిగా కాలుష్య భరితమయ్యాయని అన్నారు. స్థానికంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, సహజ నాలాల ఆక్రమణ, మూసివేత వల్ల చెరువులన్నీ ఉనికిని కోల్పోయే పరిస్థితికి చేరుకున్నాయని తెలిపారు. ఎస్‌టీపీ ప్లాంట్లు లేకపోవడం వల్ల చెరువులు కాలుష్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. చెరువుల సహజ ఫీబర్ నాలాలను పునరుద్ధరించి, పరిరక్షించాలని అధికారులను కోరారు. తెల్లాపూర్‌కు సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, సరిపడా ఎస్‌టీపీ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కోరారు. భూగర్భ జలాలు, జీవ వైవిధ్యం విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అప్పుడే ప్రజారోగ్యాలపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ప్రమాదం ఉండదని అన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులను హైడ్రా పరిరక్షించడం అభినందనీయమని అలాగే తెల్లాపూర్‌లోని చెరువులను కూడా పునరుద్ధరించి కాపాడాలని కోరారు. త్వరలోనే తెల్లాపూర్‌లో స్వయంగా పర్యటించి సమస్యను పరిష్కరిస్తానని హైడ్రా కమీషనర్ హామీ ఇచ్చారని రమణ వివరించారు. ఈ కార్యక్రమంలో తేనా సభ్యులు సుధాకర్, దీప్తి రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనాలు

ఉస్మాన్‌నగర్ బీరప్ప జాతరలో ఆలయ కమిటీ సభ్యులతో మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్

ఉస్మాన్‌నగర్ బీరప్ప జాతరలో ఆలయ కమిటీ సభ్యులతో మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్

– తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత కొల్లూరి భరత్

ఈ-కబురు, పటాన్‌చెరు : జాతరలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలకు నిదర్శనాలని తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నేత కొల్లూరి భరత్ అన్నారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ బీరప్ప జాతర మహోత్సవానికి సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతర నిర్వహణకు బీరప్ప ఆలయ కమిటీకి రూ. 2 లక్షల విరాళం అందించారు. అనంతరం మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడు అందిస్తానని హామీ ఇచ్చారు. తెల్లాపూర్ పరిధిలోని కొన్ని దశాబ్దాలుగా ఆనవాయితీగా ఈ జాతరలు జరుగుతున్నాయని, వాటిని ప్రోత్సహించి సహకరించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా పండుగలు జరుపుకోవాలని, అందరూ ఐక మత్యంగా ఉంటేనే మన ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుల్లి రవిందర్, వివేక్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంజయ్య నగర్ లో పర్యటించిన కూకట్ పల్లి జోనల్ కమిషనర్

అంజయ్య నగర్ సమస్యలను కమిషనర్ కు విస్తరిస్తున్న ఆంజనేయులు సాగర్

స్మశాన వాటికను పరిశీలిస్తున్న కమిషనర్

డివిజన్ సమస్యలను కమిషనర్ కు

వివరించిన ఆంజనేయులు సాగర్

ఈకబురు, శేరిలింగంపల్లి :
కూకట్ పల్లి జోన్ పరిధిలోని అంజయ్య నగర్ డివిజన్ అంజయ్య నగర్ కాలనీలో సోమవారం జోనల్ కమిషనర్ మయాంకు సింగ్ పర్యటించారు. అంజయ్య నగర్ కాలనీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఆంజనేయులు సాగర్ ఆధ్వర్యంలో స్మశాన వాటిక సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన కమిషనర్.. అధికారులు, స్థానికులతో కలిసి స్మశాన వాటికను పరిశీలించారు.
స్మశాన వాటిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. దీంతోపాటు అంజయ్య నగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ స్మశాన వాటికలో అభివృద్ధి పనులు లేక స్థానికులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యపై తమ వినతికి స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు. దీంతోపాటు కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న అంతర్గత రహదారులు, వీధి దీపాలు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.
ఈ కార్యక్రమములో మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ డి ఈ రూపాదేవి, బీజేపీ డివిజన్ నాయకులు ఆంజనేయులు, అంజయ్య నగర్ కమిటీ ప్రెసిడెంట్ నరసింహ సాగర్, నాయకులు రవినాయక్, సురేష్, వెంకటేష్ లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిక్ నగర్ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు పిర్యాదు

అధికారులకు ఫిర్యాదు చేస్తున్న చందు

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్దిక్ నగర్ లో నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకరంగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు జి. చందు ఆధ్వర్యంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజావాణిలో అధికారులను కలిసిన చందు సిద్దిక్ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల వివరాలను అందజేశారు. కేవలం 100 గజాల విస్తీర్ణంలో ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా ఏడంతస్తుల భారీ భవనాల నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. ఈ అక్రమ నిర్మాణాల కారణంగా బస్తీలో ట్రాఫిక్ సమస్యతో పాటు మౌలిక వసతుల సమస్యలు ఏర్పడుతున్నాయని వాపోయారు. దీంతోపాటు ప్రమాదకరంగా కొనసాగుతున్న నిర్మాణాలతో భవిష్యత్తులో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. గతంలో అక్రమ నిర్మాణాల కారణంగా సిద్ధిక్ నగర్ లో భవనం కూలిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు హరిశంకర్ యాదవ్ వినతి

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన స్పందన లేకపోవడంపై అసహనం

ఈకబురు, శేరిలింగంపల్లి : నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి కేశవ్‌నగర్ ప్రాంతంలో నెలకొన్న వీధి దీపాల సమస్య కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రాంతంలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం హరి శంకర్ యాదవ్ అధికారులకు విన్నవించారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శిరీషకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాగం హరి శంకర్ యాదవ్ మాట్లాడుతూ వీధి దీపాల సమస్య పరిష్కరించేందుకు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తుందని అన్నారు. గతంలో విద్యుత్ దీపాల సమస్యపై పలుమార్లు విన్నవించినా అధికారుల నుంచి స్పందన లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గౌలిదొడ్డి కేశవ నగర్ లో
ఇది మొదటిసారి ఫిర్యాదు చేయడం కాదని, ఇప్పటికే పలుమార్లు ప్రజావాణి కార్యక్రమంలోనూ, సంబంధిత అధికారులకు నేరుగా వినతి పత్రాలు అందజేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు. వీధి దీపాలు పనిచేయకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడటంతో పాటు భద్రతాపరమైన సమస్యలు కూడా తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాల సమస్యను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈ.రవికుమార్, సాంబశివుడు, అరుణ్, లోకేష్, బాలకృష్ణ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల కోసం ఈఈకి వినతి పత్రం సమర్పిస్తున్న హరి శంకర్ యాదవ్

అధికారంలోకి రాగానే 24 గంటలూ

తాగునీటి సరఫరా

ఈకబురు, హైదరాబాద్: గతంలో 24 గంటలపాటు విద్యుత్తు సరఫరా ఇచ్చినట్లుగానే ఈమారు మళ్లీ అధికారంలోకి రాగానే నిరంతర తాగునీటి సరఫరాను అందిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. సదరు పథకాన్ని మొదటగా హైదరాబాద్ నుంచే అమలు చేస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ కూకట్‌పల్లి నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ.. 'మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు 58, 59 జీవోల ద్వారా 2.50 లక్షల మందికి పట్టాలు అందించాం. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్ పరిసరాలతో పాటు ఖమ్మం వెలుగుమట్ల, మహబూబ్‌నగర్ దివ్యాంగుల కాలనీ వంటి ప్రాంతాల్లో వేల ఇళ్లను కూల్చి పేదలను నిరాశ్రయులను చేసింది. ఇందిరమ్మ రాజ్యమంటే ఇళ్లను కూల్చడమేనా? శని, ఆదివారాలు వచ్చాయంటే హైడ్రా అనే భూతం పేదలను భయపెట్టే దుస్థితికి పరిస్థితులు దిగజారాయి. జూన్ 25 నుంచి జులై 24 వరకు జరుగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత బూత్‌స్థాయి కార్యకర్తలపై ఉంది. దీనిపై పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తాం. ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకంగా పనిచేసే నాయకులకే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో టికెట్లను ఇస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ.వివేకానంద్, ఎమ్మెల్సీలు కె.నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, పార్టీ నేత పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి, సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజ్జెల నగేశ్, పార్టీ అసెంబ్లీ సమన్వయకర్త సతీశ్ అరోరా పాల్గొన్నారు.
గౌరవంగా ఆఖరి ప్రయాణం చేసే హక్కు పేదోడికి లేదా?
ఈనాడు, హైదరాబాద్: జీవితం ముగిసిన తర్వాత కూడా గౌరవంగా చివరి ప్రయాణం చేసే హక్కు పేదోడికి ఉండకూడదా? అని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భద్రాచలం పట్టణంలో మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లిన సంఘటనపై కేటీఆర్ సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఇది కేవలం ఒక కుటుంబం బాధ కాదు.. ఇది తెలంగాణ సమాజాన్ని కలచివేసే విషాదం. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ పరిస్థితి ఎంత దారుణంగా దిగజారిందో ఈ ఒక్క ఘటననే నిదర్శనం. బతికున్నప్పుడు అండ దొరకలేదు.. చనిపోయిన తర్వాత కనీస గౌరవం కూడా దక్కని పరిస్థితికి తెలంగాణను తీసుకొచ్చింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం' అని మండిపడ్డారు.

గుణపాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం

ఈకబురు, దిల్లీ: వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ ప్రశ్నపత్రం పదే పదే లీకవుతున్నా దానికి అడ్డుకట్టవేసేలా తగు చర్యలు తీసుకోకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వైఫల్యాల నుంచి జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గుణపాఠాలు నేర్చుకోవడంలేదంటూ జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఆలోక్ అరాధే ధర్మాసనం సోమవారం మండిపడింది. గత ఏడాది జారీ చేసిన మార్గదర్శకాల అమలుతీరుపై గురువారానికల్లా అఫిడవిట్ సమర్పించాలని ఎన్‌టీఏను ఆదేశించింది. 'పేపర్ లీక్ వ్యవహారం గతంలోనూ ఈ కోర్టు వరకు వచ్చింది. అప్పట్లో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ పలు సిఫార్సులు చేసింది. వాటిని ఎన్‌టీఏ ఆమోదించింది. అయినా గుణపాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. కమిటీ సూచనల అమలుకు ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయండి' అని ధర్మాసనం పేర్కొంది. అఖిల భారత వైద్య సంఘం సమాఖ్య (ఎఫ్ఏఐఎంఏ) దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం, ఎన్‌టీఏ, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. పేపర్ లీక్‌పై ఇప్పటికే దాఖలైన పలు పిటిషన్లతో ఎఫ్ఏఐఎంఏ అభ్యర్థననూ జత చేసింది. ఎన్‌టీఏ ప్రక్షాళనకు తీసుకున్న చర్యలే మిటో కేంద్ర ప్రభుత్వం నియమించిన ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని కమిటీ కూడా వివరించాలనీ ఆదేశించింది. ఇందుకు మూడు రోజు వ్యవధి ఇస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. లక్షల మంది విద్యార్థుల ప్రాథమిక హక్కులను పరిరక్షించేలా ఎన్‌టీఏను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, పటిష్ఠమైన, స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ ద్వారా నీట్‌యూజీని నిర్వహించాలని ఎఫ్ఏఐఎంఏ తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేసింది. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఈ నెల 12న పరీక్షను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

మళ్లీ పెట్రో మోత

ఈ-కబురు, దిల్లీ, హైదరాబాద్: దేశంలో మళ్లీ పెట్రో మోత మోగింది. పెట్రోలుపై లీటరుకు రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంచుతూ కేంద్ర ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చాయి. దేశంలో ఈ నెల 15 నుంచి పెట్రో ధరలు పెరగడం ఇది నాలుగోసారి. పెట్రోలియం డీలర్ల సంఘం గణాంకాల ప్రకారం.. తాజా పెంపుతో 10 రోజుల్లో రాష్ట్రంలో పెట్రోలుపై లీటరుకు రూ.8.23, డీజిల్‌పై రూ.8.12 పెరిగింది.

అసెంబ్లీల ఎన్నికలు కాగానే ఇంధన ధరలను మోదీ ప్రభుత్వం పెంచుతోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. పెట్రో ధరలను విడతలవారీగా పెంచడంద్వారా ప్రజలను నిశ్శబ్దంగా దోచుకుంటోందని ఆరోపించారు. మోదీని ధరల మనిషి(మెహంగాయీ మానవ్)గా ఆయన అభివర్ణించారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను భాజపా ఖండించింది. కాంగ్రెస్ నాయకుడు దేశాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు గణనీయంగా పెరిగాయని, అమెరికా, బ్రిటన్, గల్ఫ్ దేశాలతో పోలిస్తే భారత్‌లో ధరలు తక్కువగానే ఉన్నాయని భాజపా అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా స్పష్టం చేశారు.

పెట్రోలు, డీజిల్ ధరల భారం రాష్ట్ర ప్రజలపై భారీగా పడుతోంది. తెలంగాణలో రోజుకు సగటున 60 లక్షల లీటర్ల పెట్రోలు, 70 లక్షల లీటర్ల డీజిల్‌ను విక్రయిస్తున్నారు. ఈ రెండింటిపై ధరల పెంపుతో రాష్ట్ర ప్రజలపై రాబోయే ఏడాదికి రూ.3,877 కోట్ల భారం అదనంగా పడనుంది. ఇది కాకుండా పెట్రోలు, డీజిల్ వినియోగించే ఇతర అన్నిరంగాలపై తీవ్ర ప్రభావం పడనుంది. రవాణా ఛార్జీలు పెరిగాయని నిత్యావసరాల ధరలు వ్యాపారులు పెంచే ప్రమాదముంది. ఆ ఆర్థికభారాన్ని లెక్కలోకి తీసుకుంటే సామాన్యుల జేబులు ఖాళీకానున్నాయి. వచ్చే నెలలో ఖరీఫ్ ప్రారంభం కాబోతోంది. వర్షా లు ప్రారంభం కాగానే రైతులు దుక్కులకు ట్రాక్టర్లను కిరాయికి తీసుకుంటారు. వానాకాలంలో కోటి ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయి. లీటరు డీజిల్ ధర రూ.8.12 అదనంగా పెంచారని ఎకరా దుక్కి దున్నడానికి కిరాయి కనీసం రూ.100 పెంచాలనే ప్రతిపాదనలున్నట్లు ట్రాక్టర్ల యజమానులు చెప్పారు. మరోవైపు పంటల సాగుకు అనేక రకాల యంత్రాలను వాడటానికి డీజిల్, పెట్రోలు అవసరం. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం వంటి నగరాలకి అవసరమైన కూరగాయలు, పాలు, పండ్లు వంటివన్నీ రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి సైతం నిత్యం వస్తుంటాయి. ఈ నేపథ్యంలో రవాణా ఛార్జీలు పెరిగాయని కూరగాయల ధరలు పెంచుతున్నారు

కర్ణాటక సరిహద్దులో..
2 బ్రిడ్జి కమ్ బరాజ్‌లు!

ఈకబురు, హైదరాబాద్: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో రెండు బ్రిడ్జి కమ్ బరాజ్‌లను సంయుక్తంగా నిర్మించాలనే ప్రతిపాదనలపై ఉభయ రాష్ట్రాల మధ్య సంప్రదింపులు ప్రారంభమయ్యాయి. కొల్పూర్, కొర్తుకుండ వద్ద కృష్ణా నదిపై 1.08 టీఎంసీల సామర్థ్యంతో ఒక బ్రిడ్జి కమ్ బరాజ్.. తంగడగి గ్రామం వద్ద భీమా నదిపై 1 టీఎంసీ సామర్థ్యంతో మరో బ్రిడ్జి కమ్ బరాజ్ నిర్మించాలనే ప్రతిపాదనలపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో రెండు రాష్ట్రాల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కర్ణాటక చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.జూరాల ప్రాజెక్టుకు సుమారు 30 కి.మీ.ల ఎగువన కొల్పూర్, కొర్తుకుండ వద్ద ఒక బరాజ్, కృష్ణా ప్రధాన పాయలో భీమా నది కలిసే ప్రాంతానికి ఎగువన తంగడగి వద్ద మరో బరాజ్ నిర్మించాలనే ప్రతిపాదనలపై కర్ణాటక అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ బరాజ్‌ల నిర్మాణంతో రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందని కర్ణాటక మంత్రి చెప్పారు. బరాజ్‌ల కుడి వైపు నుంచి కర్ణాటక, ఎడమ వైపు నుంచి తెలంగాణ.. నీళ్లను మళ్లించుకోవచ్చని, వేసవిలో తాగునీటి అవసరాల కోసం పంపింగ్ చేసుకోవచ్చని సూచించారు. అయితే ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజా ప్రతినిధుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో సమగ్ర అధ్యయనం కోసం నీటిపారుదల శాఖ కార్యదర్శి, ఈఎన్‌సీ (జనరల్), ఇతర నిపుణులతో ఒక కమిటీ వేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రెండు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగించే నిర్ణయం తీసుకుంటామని, ఈ మేరకు ఒప్పందం చేసుకుంటామని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలగకుండా ప్రతిపాదనలను కర్ణాటక మంత్రికి వివరించామని ఉత్తమ్ మీడియాకు తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే ప్రతిపాదనలను ఆ రాష్ట్రం ముందు ఉంచినట్టు వెల్లడించారు. ఈ చర్చల్లో సాధించిన పురోగతిని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కృష్ణా, భీమా నదులపై బరాజ్‌లు నిర్మిస్తే దిగువన ఉన్న జూరాల ప్రాజెక్టుకు వరదలు లేనప్పుడు వచ్చే రీజనరేటెడ్ నీళ్ల ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. ప్రధానంగా బీమా నదిపై ఇప్పటికే కర్ణాటక ఇబ్బడిముబ్బడిగా ప్రాజెక్టులు నిర్మించడంతో జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గిపోయిందని ఆయన అన్నారు. కృష్ణా, భీమా నదులపై ఎగువన కర్ణాటకలో ఇప్పటికే కట్టిన ప్రాజెక్టులతో వర్షాభావ సంవత్సరాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు కరువు పీడిత మక్తల్ నియోజకవర్గానికి తాగు, సాగునీటి సరఫరా కోసం ఈ రెండు బరాజ్‌లను నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. కర్ణాటకలోని ఆల్మట్టి బరాజ్ ఎత్తు పెంచడానికి ఆ రాష్ట్రం తీసుకుంటున్న చర్యలతో తమ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు పలువురు కర్ణాటక మంత్రిని నిలదీసినట్టు తెలిసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగానికి కీలకమైన ఆర్డీఎస్ ఆధునికీకరణ ప్రాజెక్టుకు కర్ణాటక సహకరించడం లేదని ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేయగా, ఈ విషయంలో ఏపీ సహకరించడం లేదని కర్ణాటక మంత్రి బదులిచ్చారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన నిధులు విడుదల చేస్తే సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రాయచూర్ ఎంపీ జి.కుమార్‌నాయక్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే బసన్నగౌడ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మేఘారెడ్డి, శివకుమార్‌రెడ్డి, వంశీకృష్ణ, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ.శ్రీధర్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రపంచ విపణికి ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు

ఈకబురు, , విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన ఎంఎస్ఎంఈల ద్వారా తయారైన ఉత్పత్తులు ప్రపంచ విపణికి చేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా ఎంఎస్ఎంఈ రంగం ఉందని... భారీ పరిశ్రమలు దేశానికి ప్రతిష్ఠ తీసుకువస్తే.. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు లక్షల మందికి జీవనోపాధిని కలిగిస్తాయని అన్నారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026కు ముఖ్యమంత్రి హాజరయ్యారు. అంతకుముందు 4.4 ఎకరాల్లో 1.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఒకేసారి 1500 మంది హాజరై కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెషన్ సెంటర్ నిర్మించటం సంతోషమన్నారు. అమరావతిలోనూ ఈ తరహా కన్వెన్షన్ సెంటర్లను నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లు నిర్మించనున్నట్టు సీఎం తెలిపారు.ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ సందర్భంగా రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఇస్తున్న వెసులుబాట్లను... చేయూతను ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉంది. యువత కలలకు, మహిళ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఉన్న ఈ రంగం వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తోంది. ఏపీలో వనరులకు, అవకాశాలకు కొదవలేదు. వీటిని వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అవకాశాలు కల్పిస్తున్నాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, రైల్వే లాంటి లాజిస్టిక్స్ కూడా ఏపీలో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, ఎంట్రప్రెన్యూర్ డెవలప్మెంట్ పాలసీ, ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తెచ్చి ఈ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఎంఎస్ఎంఈ సమ్మిట్ కొత్త ఆవిష్కరణలకు వేదిక కావాలి. కొత్త పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలి. పారిశ్రామిక యానిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవాళ మరో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశాం. త్వరలో ఈ 138 పారిశ్రామిక పార్కులు సిద్ధం అవుతాయి. మిగిలిన వాటిని జూలై నాటికి శంకుస్థాపనలు చేసి అన్ని మౌలిక వసతులూ కల్పిస్తాం. ఈ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు."అని ముఖ్యమంత్రి అన్నారు.

APCMEPకు రూ. 300 కోట్లు

"ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు, నిపుణులు, బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లబ్దిదారులు ఒకే వేదికపైకి వచ్చారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు కావాలి. రాష్ట్రంలో 20.77 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.558 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం. పీఎంఈజీపీ, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, పీఎం విశ్వకర్మ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేస్తూ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్స్ ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రామ్ కింద రూ.300 కోట్లను కేటాయిస్తున్నాం. రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నాం. ఏపీఐఐసీలో ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించే ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ 2953 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు అయ్యాయి. వీటి ద్వారా రూ.4.68 లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ప్రైవేటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తాం. ప్రైవేటు రంగంలో శ్రీసిటీ ఓ విజయవంతమైన పారిశ్రామిక పార్కు." అని ముఖ్యమంత్రి అన్నారు.

–ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు లక్ష్యం

"రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. త్వరలో 5 లక్షల మంది డ్వాక్రా మహిళల్ని ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దుతామని ... మహిళా సంఘాల వద్ద ప్రస్తుతం రూ.28 వేల కోట్ల కార్పస్ ఉంది. ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఏపీని ఇన్నోవేషన్ డ్రివెన్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది ప్రభుత్వ నినాదం. గ్రామీణ ప్రాంతాలకు టెక్నాలజీ తీసుకువెళ్లాలనే లక్ష్యంతో స్మార్ట్ విలేజ్ సెంటర్లను ప్రారంభిస్తున్నాం. ఓ పరిశ్రమ వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుంది. సర్క్యులర్ ఎకానమీపై ఎంఎస్ఎంఈలు దృష్టి పెట్టాలి. ఎంఎస్ఎంఈలు ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్న లక్ష్యంతో మెటా, అమెజాన్, జోహో లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం."అని ముఖ్యమంత్రి తెలిపారు.

జెన్ జీ వర్గం యువత కలల్ని సాకారం చేస్తాం

"మెటా, అమెజాన్ లాంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు యువత భవిష్యత్తుకు ఉపాధికి, నైపుణ్యాలకు కొత్త దారుల్ని సృష్టిస్తాయి. మారుతున్న టెక్నాలజీ... ఉద్యోగాల స్వరూపాన్ని మారుస్తోంది. అందుకే టెక్నాలజీ స్కిల్ బిజినెస్ ఇంటిగ్రేషన్ మోడల్ ను అనుసరిస్తున్నాం. పరిశ్రమలకు అనువైన స్కిల్ డెవలప్మెంట్ పై దృష్టి పెట్టాం. ఆధునిక టెక్నాలజీ ఎకోసిస్టమ్ ద్వారా రాష్ట్ర యువతకు గ్లోబల్ స్థాయిలో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఏఐ, మెటలర్జీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ ఏవియేషన్ లాంటి ఫంక్షనల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నాం... పరిశ్రమలకు నైపుణ్యాలు అందించే కేంద్రాలుగా ఇవి మారబోతున్నాయి. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్లకు మేలు కలిగేలా... వారి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టెక్నాలజీతో పాటు ఆధ్యాత్మికత కూడా కీలకమైన అంశం. యువశక్తి, టెక్నాలజీ, పరిశ్రమల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లతో ఏపీ అభివృద్ధి చేస్తున్నాం. ప్రతీ రంగంలోనూ ఎంఎస్ఎంఈలు పెట్టుబడులు పెట్టేందుకు ఆస్కారం ఉంది. ప్రధాని మోదీ ఇచ్చిన చిప్ టు షిప్ అన్న నినాదాన్ని నిజం చేసేలా తయారీ రంగంపై దృష్టి పెట్టాం. సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్ అన్నది ప్రభుత్వ విధానం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా సీఎం సమక్షంలో మెటా, అమెజాన్, జోహో సహా వివిధ సంస్థలతో ఏపీ ఎంఎస్ఎంఈడీసీ ఒప్పందం కుదుర్చుకుంది. డీప్ టెక్ స్టార్టప్ కంపెనీలకు రూ.20 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసేందుకు సిడ్బీ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఒప్పందం చేసుకుంది. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నేతృత్వంలోని స్టార్టప్ కంపెనీలు తయారు చేసిన టెక్నాలజీ ఎనేబుల్డ్ హ్యాండ్ ఇతర ఐటీ, టెక్ ఉత్పత్తులు, డిఫెన్స్ ఉత్పత్తులు, BHEL తయారు చేసిన ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, ప్రైవేట్ సంస్థలు రూపొందించిన డ్రోన్ బోట్లు, వివిధ రకాల గిరిజన ఉత్పత్తులను సీఎం తిలకించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

'కాలుష్యరహిత గోదావరి పుష్కరాలు'

ఈకబురు, రాజమండ్రి :

'గోదావరి నదిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, జలాలు, వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి నివేదిక ఇవ్వండి. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? భవిష్యత్తులో చేయబోయే పనుల మీద స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయండి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉన్నత అధికారులు, తూర్పు గోదావరి జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను 'కాలుష్యరహిత గోదావరి' థీమ్ తో సాకారం చేసి నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 6గం.కు పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి కోటిలింగాలు ఘాట్ వరకు పడవలో ప్రయాణించి గోదావరి జలాల కాలుష్యకారక ప్రాంతాలని పరిశీలించారు. పుష్కరాల్లో చేయాల్సిన పనుల తీరు, త్వరలో చేపట్టబోయే పనుల ప్రణాళికను స్వయంగా పరిశీలించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు ఎంతవరకు వచ్చాయనేది, పుష్కరాల నేపథ్యంలో గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నది అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం మురుగు నీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. నది తీరంలో జరుగుతున్న కాలుష్యం తీరును స్వయంగా చూశారు. నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బందితో మాట్లాడి వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారులకు ఆదేశాలిస్తూ "గోదావరిలోకి రోజువారీ సుమారుగా 55 ఎం. ఎల్. డి. (మిలియన్ లీటర్స్ పర్ డే) మురుగునీరు వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ మురుగు నీటిని శుద్ధి చేసే విధానం శాస్త్రీయంగా జరగాలి. మురుగు నీటిని నేరుగా గోదావరిలోకి వదలడం వల్ల జలాలు కలుషితం అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలి.

–నిధులను సత్కార్యం కోసం వినియోగించుకుందాం

గోదావరి పుష్కరాలకు ఖర్చు చేసే ప్రతి పైసాను ప్రజలకు ఉపయోగపడే, గోదావరి నది తీరాన్ని కాపాడే మంచి పనులకు ఉపయోగించుకోవాలి. మొదట కాలుష్యకారక అంశాలపై పూర్తిస్థాయి ఆడిట్ జరగాలి.. తర్వాత దానిని ఎలా అధిగమించాలి అనే అంశాల పట్ల దృష్టి సారించవచ్చు. కేవలం లెక్కలతో సరిపెట్టకుండా పూర్తి స్థాయి యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్దాం. కేంద్ర జల శక్తి ద్వారా ఎన్.ఆర్.సి.పి. నిధులు రూ. 416 కోట్లలో రూ. 95 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు వచ్చాయి. ఈ నిధులతో కొత్త ట్రీట్మెంట్ ప్లాంట్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాలి. పూర్తిస్థాయిలో మురుగు లేకుండా జలాలను గోదావరిలోకి విడిచిపెట్టి బాధ్యతను తీసుకోవాల"ని ఆదేశించారు.

–పేపర్ మిల్ కాలుష్యంపై ఆరా

ఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్య జలాలు గోదావరిలోకి విడుదల మీద ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య నుంచి వివరాలు అడిగారు. ప్రస్తుతం పేపర్ మిల్లు ద్వారా బయటకు వచ్చే వ్యర్థాలను దూరంగా లంకల్లో విడిచి పెడుతున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా ఆ కంపెనీ మరో ప్రాంతంలో శుద్ధి చేసేందుకు ఆలోచిస్తుందని ఆయన తెలియజేశారు. ప్రత్యామ్నాయ పనులు వేగంగా జరిగేలా చూడాలని, అప్పటివరకు మరో శుద్ధి ప్లాంట్ నిర్మించుకునేలా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

–ఆసాంతం పరిశీలిస్తూ...

బోటులో ప్రయాణిస్తున్న దగ్గర నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకునే వరకు గోదావరి కాలుష్య నివారణకు తీసుకోబోతున్న చర్యలను పవన్ కళ్యాణ్ అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రత్యక్షంగా ట్రీట్మెంట్ ప్లాంట్ వద్దకు వెళ్లి వేరు చేస్తున్న వ్యర్థాలను సైతం చూశారు. ఆ వ్యర్థాలను ఏం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి ప్రస్తుతం ఎలాంటి శాస్త్రీయ పద్ధతి ఉపయోగిస్తున్నారని వివరాలు అడిగారు. నూతన విధానాలు వస్తున్నాయని దానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలని

అధికారులు సూచించారు. అక్కడి నుంచి నేరుగా పుష్కరాల పనుల సమీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి పవన్ కళ్యాణ్ చేరుకున్నారు. పవన్ కళ్యాణ్ తోపాటు మంత్రులు నాదెండ్ల మనోహర్ తదితరులు ఉన్నారు.

పొదుపు చర్యలపై విమర్శలు తగవు

ఈ-కబురు, ముంబయి: దేశ ఆర్థిక రక్షణ కోసం పొదుపు పాటించాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు ఇవ్వడాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గట్టిగా సమర్థించారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో మూడు ఎఫ్‌లు.. ఇంధనం, ఎరువులు, విదేశీ మారకపు ద్రవ్యం (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్)పై అందరూ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ పిలుపు తర్వాత, కొంత మంది నిరాశావాదాన్ని వ్యాప్తి చేయడాన్ని తప్పపట్టారు. ప్రజల్లో భయాన్ని నింపకూడదని హితవు పలికారు. సోమవారమిక్కడ జరిగిన సిడ్బి 37వ వ్యవస్థాపక దినోత్సవంలో పలు అంశాలపై ఆర్థిక మంత్రి ఏమన్నారంటే..

దేశీయ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది..: తాజా పరిణామాలు అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల సంభవించినవే. దేశీయ ఆర్థిక వ్యవస్థ సానుకూలంగా, బలంగా ఉంది. ప్రధాని పొదుపునకు పిలుపునిచ్చాక, కొంత మంది విషపూరిత, నిరాశావాద ధోరణిని వ్యాప్తి చేస్తున్నారు. వాస్తవ విరుద్ధాలతో కూడిన ఆ ప్రచారం వల్ల, మనుషుల్లో భయం పెరుగుతుంది. మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలే తప్ప ఇలా చేయరాదు.

రూ.లక్ష కోట్ల వరకు ప్రభావం: ముడిచమురు, పసిడి ధరలూ అధికం కావడం కొంత ఆందోళనలు తీసుకొచ్చాయి. ఎరువుల ధరల్లోనూ ఊహించనంత పెరుగుదల ఏర్పడుతోంది. అందుకే ఇంధనం, ఎరువులు, విదేశీమారకంపై గట్టిగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. దేశీయ వృద్ధిని కాపాడుకోవడం కోసం, విధాన పరమైన చర్యల ద్వారా మనదేశం స్పందించింది. డీజిల్, పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకం కోత వల్ల, ఖజానాపై రూ.లక్ష కోట్ల వరకు ప్రభావం పడొచ్చు.

ఎమ్ఎస్ఎమ్ఈలకు చెల్లింపులు వేగంగా చేయండి: ప్రధాని పిలుపు అనంతరం ప్రతిదీ 'ప్రతికూలంగా' మారుతోందని కొంత మంది పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారు. అది తప్పు. ఆర్థిక వ్యవస్థలో జీఎస్‌టీ వసూళ్లు, వాహన విక్రయాల వంటి ఎన్నో అంశాలు సానుకూలంగా నమోదవుతున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీ (ఎమ్ఎస్ఎమ్ఈ)లకు రూ.8.1 లక్షల కోట్ల మేర చెల్లింపులు ఆలస్య చట్రంలో చిక్కుకున్నాయి. ఇది వాటి వర్కింగ్ క్యాపిటల్, వృద్ధిపై ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు వెంటనే 45 రోజుల గవాక్షాన్ని మించకుండా చెల్లింపులు చేయాలి. అలా చేస్తే ఎమ్ఎస్ఎమ్ఈలపై ఆధారపడ్డ మధ్యతరగతి బాగుంటుంది. వారు బాగుంటే 'వికసిత్ భారత్' సాధ్యమవుతుంది.

ఒక్కొక్కర్ని కొడతాను చూడు.. ప్రేమతో!

"హీరో అయినా హౌస్ వైఫ్ అయినా డైలాగ్ కరెక్ట్‌గా పడిందంటే ఎవడైనా బెదరాల్సిందే" అంటోంది నటి సమంత. ఇప్పుడామె నుంచి వస్తున్న కొత్త చిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాని రాజ్ నిడిమోరు, సమంత, హిమాంక్ దువ్వూరు నిర్మించారు. ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. "నేనెవరో నీకు తెలుసా.. అసలు నేనెవరో నీకు తెలుసా" అంటూ ట్రైలర్‌లో సమంత పాత్రని పరిచయం చేసిన తీరు.. మాస్ యాక్షన్‌తో ఆమె చేసిన విధ్వంసం ఆద్యంతం ఆసక్తిరేకెత్తించింది. "ఒక్కొక్కర్నీ కొడతాను చూడు.. ప్రేమతో అబ్బా" అంటూ ఆఖర్లో సామ్ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ.. "కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది. దీన్ని అందరూ తమ బంగారాలతో కలిసి తప్పకుండా చూడండి. కచ్చితంగా నేను అందర్నీ గర్వపడేలా చేస్తా" అన్నారు. "సమంత అభిమానిగా చెప్తున్నా.. జూన్ 19న థియేటర్లు బద్దలైపోతాయ"న్నారు నందినీ రెడ్డి. ఈ కార్యక్రమంలో రాజ్ నిడిమోరు, శ్రీముఖి, హిమాంక్, గవిరెడ్డి, బేబీ మాయ తదితరులు పాల్గొన్నారు.

కనిపించకపోతే "మర్చిపోతారు

టాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్‌లలో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రద్ధా శ్రీనాథ్. గత ఏడాది 'ఆర్యన్' చిత్రంతో ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం 'బ్రో కోడ్' మూవీతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ప్రస్తుత జనరేషన్‌లో నటీనటులపై ఉన్న ఒత్తిడి గురించి శ్రద్ధా ఓపెన్‌గా మాట్లాడారు. "ఈ రోజుల్లో కేవలం నటిగా ఉంటే సరిపోదు. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ, మనం బతికే ఉన్నామని జనాలకి గుర్తు చేస్తూనే ఉండాలి. సినిమాల క్వాలిటీ కంటే ఆన్‌లైన్ విజిబిలిటీకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. నాకైతే నా పర్సనల్ లైఫ్‌ను నిరంతరం ఆన్‌లైన్‌లో షేర్ చేయడం అస్సలు నచ్చదు.

కానీ అలా చేయకపోతే వెనకబడిపోతామనే భయం వేస్తుంది. ఒక ఫ్రెండ్ సలహా మేరకు ఇప్పుడు దీన్ని ఒక గేమ్ లాగా భావించి ఫాలో అవుతున్నాను" అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పుకొచ్చారు. ఇక ఇప్పటివరకు పలు రొమాంటిక్ డ్రామాలలో నటించి మెప్పించిన నటి శ్రద్ధా శ్రీనాథ్, ఇకపై మరింత సవాలుతో కూడిన పాత్రలు చేయాలనుకుంటున్నట్లు వెల్లడించారు. "సినిమాల్లో సరికొత్తదనం తీసుకురావాలనుకుంటున్నాను. చారిత్రక డ్రామాలు, సైన్స్ ఫిక్షన్, భావోద్వేగ తీవ్రత ఉన్న పాత్రలు, అలాగే శారీరకంగా ఎక్కువగా శ్రమించే పాత్రలను పోషించాలని ఉంది. ఎప్పటికైనా వెండితెరపై ఒక పవర్‌ఫుల్ రాణి పాత్ర చేయాలనుకుంటున్నాను. కనీసం ఒక 'ఏజెంట్' పాత్ర అయినా సరే చేయాలనేది నా జీవితకాల కోరిక'' అని చెప్పింది.

ఆ ముగ్గురు హీరోల హిట్స్ వెనుక త్రిష..

అగ్ర కథానాయిక త్రిష పేరు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తమిళ చిత్ర పరిశ్రమకు చెందిన ముగ్గురు అగ్ర హీరోల కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె (Trisha) భాగం కావడం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఓ అభిమాని సోషల్ మీడియాలో షేర్ చేసిన ఆసక్తికరమైన పోస్ట్‌ను త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్నారు. విజయ్, అజిత్, సూర్యల (Suriya) కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష నటించారని ఓ అభిమాని పోస్ట్ పెట్టారు. వారి బ్లాక్‌బస్టర్ వెనక.. త్రిష మ్యాజిక్ ఉందని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌ను ఆమె షేర్ చేసి హార్ట్ ఎమోజీతో థాంక్యూ చెప్పారు.విజయ్ 'లియో': కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ (Vijay) నటించిన 'లియో' ఆయన కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు నెలకొల్పింది. 2023లో విడుదలైన ఈ సినిమా రూ.600 కోట్లకు పైగా వసూలుచేసినట్లు టీమ్ తెలిపింది. ఇందులో త్రిష హీరోయిన్.అజిత్ కుమార్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ': అజిత్ కుమార్ (Ajith Kumar) కెరీర్ బెస్ట్ హిట్‌గా నిలిచి, ప్రపంచ వ్యాప్తంగా రూ.248 కోట్లకు పైగా వసూలు చేసింది 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లోనూ త్రిష కీలక పాత్ర పోషించారు. 2025లో ఈ సినిమా విడుదలైన సంగతి తెలిసిందే.సూర్య 'కరుప్పు': వరుస ఫ్లాప్‌లతో ఉన్న సూర్య తాజాగా 'కరుప్పు'తో కమ్ బ్యాక్ ఇచ్చారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా రూ.300 కోట్ల దిశగా పరుగులు పెడుతోంది. ఇందులో సూర్యకు జోడీగా త్రిష లాయర్ ప్రీతి పాత్రలో మెప్పించారు. ఈ మూడు సినిమాల్లో త్రిష హీరోయిన్ కావడంతో ఆమె లక్కీ ఛార్మ్ అంటూ అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. ప్రస్తుతం ఆమె టాలీవుడ్‌లో 'విశ్వంభర'లో నటిస్తున్నారు. చిరంజీవి (Chiranjeevi) హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. ఇందులో ఆమె అవనిగా కనిపించనున్నారు.

ఇది 'పెద్ది' సమస్య మాత్రమే కాదు.. ఇండస్ట్రీది: ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు

పర్సంటేజీ విధానంలో సినిమాల ప్రదర్శన అనేది కేవలం 'పెద్ది'కి సంబంధించింది మాత్రమే కాదని, ఇండస్ట్రీకి చెందినదని తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు అన్నారు. రెండు రోజుల్లో దీనికి పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం అగ్ర కథానాయకుడు చిరంజీవిని (Chiranjeevi) తెలంగాణ ఛాంబర్ ఎగ్జిబిటర్లు, నిర్మాతలు దిల్ రాజు, సురేశ్‌బాబు, కేఎల్ నారాయణ, అల్లు అరవింద్ తదితరులు కలిశారు. దాదాపు గంటకు పైగా ఆయనతో సమావేశమయ్యారు. సినిమాలు ప్రదర్శించే విషయంలో ఎగ్జిబిటర్లు, థియేటర్ యజమానులు కోరుతున్న పర్సంటేజీ విధానం సహా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పర్సంటేజీ విషయంలో ఏదో ఒక స్పష్టమైన నిర్ణయానికి రావాలని ఇటు నిర్మాతలు, అటు ఎగ్జిబిటర్లకు చిరంజీవి సూచించినట్లు సమాచారం. రాబోయే చిత్రాలకు ఇబ్బంది లేకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని అన్నట్లు తెలుస్తోంది.చిరంజీవితో సమావేశం అనంతరం నిర్మాత దిల్‌రాజు మాట్లాడారు. ''పర్సంటేజీ విధానంపై ఎగ్జిబిటర్లు అన్ని విషయాలను చిరంజీవిగారికి వివరించారు. ఆయన సానుకూలంగా విన్నారు. వారం కిందట ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీ నుంచి మరిన్ని వివరాలు తెప్పించుకుని పరిశీలిస్తానన్నారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అందుకు సంబంధించిన వివరాలను ఛాంబర్ అధికారికంగా ప్రకటిస్తుంది'' అని అన్నారు. ''ఎగ్జిబిటర్ల సమస్యలను చిరంజీవి సానుకూలంగా విన్నారు. సింగిల్ స్క్రీన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చాం. 'ఇన్ని ఇబ్బందులు ఉన్నాయా' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఛాంబర్ ఏర్పాటు చేసిన కమిటీని కూడా పిలిచి మాట్లాడాతానని అన్నారు. మేము కూడా ఎగ్జిబిటర్లతో కూర్చొని మాట్లాడి తుది నిర్ణయం తీసుకుంటాం'' అని తెలంగాణ ఎగ్జిబిటర్ల కార్యదర్శి శ్రీధర్ అన్నారు.

అన్యాయం ఎవరికి జరిగినా పోరాడాల్సిందే!

''మన తల్లిదండ్రులకో... మనవాళ్లకో అన్యాయం జరిగితే న్యాయం కోసం కచ్చితంగా పోరాడతాం. అయితే సమాజంలో ఎవరికి అన్యాయం జరిగినా పోరాడాలనే సందేశాన్నిచ్చే సినిమానే 'బ్లాస్ట్ జోన్' అన్నారు అర్జున్ సర్జా. ఆయనతోపాటు, అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన సినిమానే 'బ్లాస్ట్ జోన్'. సుభాష్ కె.రాజ్ దర్శకత్వం వహించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు రాష్ట్రాల్లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సోమవారం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది. అర్జున్ మాట్లాడుతూ ''పూర్తయిన తర్వాత చూసుకుని సంతృప్తి పొందే సినిమాలు కొన్ని ఉంటాయి. అలాంటి సినిమానే ఇది కూడా. తల్లిదండ్రులుగా ఆడబిడ్డల్లో ధైర్యాన్ని ఎలా నింపాలో, ఎవరికోసమో ఎదురు చూడకుండా మనల్ని మనం కాపాడుకోవడానికి ఏం చేయాలో ఈ సినిమా చెబుతుంది. నేనెన్నో సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలు చేశాను కానీ, ఈ సినిమాలో అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రత్యేకంగా తర్ఫీదు పొంది నాకంటే బాగా ఫైట్లు చేశారు. మహిళా సాధికారత అంశానికి వాణిజ్యాంశాల్ని జోడించి తీసిన ఓ గొప్ప చిత్రమిది. దర్శకుడు సుభాష్ కె.రాజ్ వయసులో చిన్నవాడైనా గొప్పగా సినిమాని తెరకెక్కించాడు. ఇందులోని ప్రతి పాత్ర కనెక్ట్ అవుతుంది'' అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ని కలవడం గురించి మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు అర్జున్ బదులిస్తూ... ''ఈ మధ్యే విజయ్‌తో కలిసి నటించా. ఆయన ముఖ్యమంత్రి అయినందుకు గర్వపడుతున్నా. ఆయన్ని కలిసినప్పుడు 'తొలిసారి ముఖ్యమంత్రి కుర్చీ దగ్గరకు వెళుతున్నప్పుడు 'ఒకే ఒక్కడు' సినిమానే గుర్తొచ్చింది' అన్నారు. ఆయన ఓ గొప్ప లక్ష్యం సాధించార''న్నారు. నటి అభిరామి మాట్లాడుతూ ''నా కెరీర్‌లో ఒక చిన్న ఫైట్ కూడా చేయలేదు. అలాంటి నన్ను ఈ సినిమాలో కొత్తగా చూపించారు దర్శకుడు. ఈ సినిమాకోసం చాలా కష్టపడ్డాను'' అన్నారు. ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ ''అర్జున్ పక్కన ఉంటూ యాక్షన్ సన్నివేశాల్లో నటించడం గొప్ప అనుభవం'' అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ ఐశ్వర్య కల్పాతితో పాటు ఇతర చిత్ర బృందం పాల్గొంది.

అందర్నీ ఆశ్చర్యపరిచేలా 'పెద్ది' క్లైమాక్స్

పెద్ది' కథలో వివిధ రకాల ఆటలున్నా.. దేనికదే బలమైన ముద్ర వేస్తుంద''న్నారు నటుడు శివ రాజ్‌కుమార్. ఆయన 'పెద్ది'లో గౌర్నాయుడు అనే ఓ కీలక పాత్రలో నటించారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా సినిమా జూన్ 4న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు శివ రాజ్‌కుమార్. ''నేనెప్పుడూ నా మనసుకు దగ్గరైన పాత్రలే చేస్తా. ఈ సినిమాలో గౌర్నాయుడు కూడా అలాంటిదే. ఇది చాలా అద్భుతమైన కథ. నా పాత్రకి ఓ లక్ష్యం.. మంచి ఉద్దేశం ఉంటుంది. దీన్ని దర్శకుడు బుచ్చిబాబు ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. అందుకే ఈ కథ విన్నాక తప్పకుండా ఈ సినిమాలో భాగం కావాలనిపించింది. దీంట్లో నాది కోచ్ పాత్రలాగే ఉంటుంది. పెద్ది ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. ఈ క్రమంలోనే తన దారిలోకి ఎన్నో పాత్రలొస్తాయి. ఇక పెద్దికి.. నాకు మధ్య ఉండే అనుబంధం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. మా ఇద్దరి మధ్య ప్రేమ, ఆప్యాయత, ఎమోషన్ ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది''.

''ఈ సినిమాలో నటనకి గానూ రామ్‌చరణ్‌కి జాతీయ పురస్కారం వస్తుందని నమ్ముతున్నా. ఈ చిత్రం కోసం రెండేళ్ల పాటు ఎంతో అంకితభావంతో పని చేశారు. పెద్ది పాత్రలో ఒదిగిపోయి.. ఎంతో నిజాయతీగా చేశారు. ఆ పాత్ర కోసం తన శరీరాన్ని మార్చుకున్న తీరు.. తన నటన అన్నీ కట్టిపడేస్తాయి. దర్శకుడు బుచ్చిబాబు ఈ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. కథకి ఏది అవసరమో.. దాన్నే తెరకెక్కించారు. పెద్ది ప్రయాణం తప్పకుండా అందరికీ నచ్చుతుంది. దీంట్లోని సర్‌ప్రైజింగ్ క్లైమాక్స్‌ని థియేటర్‌లో చూసే ఆస్వాదించాలి''.

''దర్శకుడు ఓసారి కథ చెప్పాక ఆ పాత్ర కోసం నేనొక స్టైల్‌ని అనుకుంటా. దాన్ని దర్శకుడితో చర్చిస్తా. ఆ తర్వాత ఆయన సూచనలు, నా ఆలోచనలు కలిపి ఒక అవగాహనతో ఆ పాత్రని చేస్తా. ప్రతి సినిమాని నేనిలాగే చేస్తా. మంచి కథలొస్తే తప్పకుండా తెలుగులో వరుస సినిమాలు చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగులో 'గుమ్మడి నర్సయ్య' బయోపిక్ చేస్తున్నా. అలాగే రజనీకాంత్‌తో 'జైలర్ 2'లో నటిస్తున్నా''. ''నేను నా జీవితంలో చేసిన అత్యంత స్ఫూర్తిదాయకమైన సినిమా 'పెద్ది'' అన్నారు కథానాయకుడు రామ్‌చరణ్. సోమవారం బెంగళూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ.. ''దాదాపు రెండున్నరేళ్ల తర్వాత మళ్లీ అందరి ముందుకొస్తున్నా. ఈ చిత్రం కోసం మేమంతా ఎంతో నిజాయతీగా, ప్రాణం పెట్టి పని చేశాం. రాసిపెట్టుకోండి. ఇది అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఈ సినిమా ద్వారా శివ రాజ్‌కుమార్ లాంటి గొప్ప నటుడితో కలిసి పని చేయడం నా జన్మ ధన్యమైంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో జాన్వీ కపూర్, శివ రాజ్‌కుమార్, వెంకట సతీశ్ కిలారు తదితరులు పాల్గొన్నారు.

నాపై విమర్శల్లో న్యాయముంది

ఓస్లో: తనపై వస్తున్న విమర్శల్లో న్యాయం ఉందని, కొద్ది నెలలుగా అంచనాలు అందుకోలేకపోతున్నానని ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ వ్యాఖ్యానించాడు. నార్వే చెస్ టోర్నీ సందర్భంగా అతడు మాట్లాడాడు. ''ఏడాదిన్నరగా నా ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉంది. అందువల్ల నా ఆటపై విమర్శకులు తమ అభిప్రాయాల్ని చెప్పడంలో తప్పులేదు. నార్వే చెస్, ఒలింపియాడ్‌ల్లోనే కాక మరిన్ని టోర్నీల్లో పాల్గొనాలని భావిస్తున్నా'' అని గుకేశ్ అన్నాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ గురించి అతను మాట్లాడుతూ.. ''భారత్‌లో నిర్వహిస్తే నాకెంతో ప్రత్యేకంగా ఉంటుంది. ప్రపంచ టైటిల్ గెలవడానికి, దాన్ని నిలబెట్టుకోవడానికి వేర్వేరు ఆలోచనా విధానాలు అవసరం. టైటిల్ నెగ్గడం కంటే కాచుకోవడం కష్టతరమైందని చాలా మంది అన్నారు. చాలా అంచనాలుండడం వల్ల.. ఓడిపోకూడదనే ఒత్తిడి నాపై ఉంది. కాబట్టి నా శాయశక్తులా గెలిచేందుకు ప్రయత్నిస్తా'' అని తెలిపాడు. గుకేశ్ గత ఏడాది ఇదే టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్‌ల్‌సన్‌పై విజయం సాధించాడు. దీంతో కార్‌ల్‌సన్ బల్లపై బాది తీవ్ర అసహనం వ్యక్తం చేసిన దృశ్యాలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి.

బరిలో సింధు, లక్ష్యసేన్

సింగపూర్: భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ మరో సవాల్‌కు సిద్ధమయ్యారు. మంగళవారం ఆరంభమయ్యే సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో బరిలోకి దిగుతున్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో పుత్రి కుసుమవర్ధిని (ఇండోనేషియా)తో సింధు తలపడనుంది. ఇటీవలే థాయ్‌లాండ్ ఓపెన్లో క్వార్టర్స్ చేరిన సింధు.. సింగపూర్ ఓపెన్లో ఎలా ఆడుతుందో చూడాలి. ఉన్నతి హుడా, మాళవిక బన్సోద్ కూడా సింగిల్స్ బరిలో ఉన్నారు. టొమోకా (జపాన్)తో ఉన్నతి.. లిన్ సియాంగ్ (చైనీస్ తైపీ)తో మాళవిక తొలి రౌండ్ ఆడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో లు జువాంగ్ (చైనా)ను లక్ష్యసేన్ ఢీకొనబోతున్నాడు. లో కీన్ (సింగపూర్)తో కిదాంబి శ్రీకాంత్.. జొనాథన్ క్రిస్టీ (ఇండోనేషియా)తో ప్రణయ్.. విక్టర్ లాయ్‌తో ఆయుష్ శెట్టి తలపడనున్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జంట.. తొలి రౌండ్లో చెన్ జీప్రెస్లీ స్మిత్ (అమెరికా) జోడీని ఢీకొనబోతోంది. హరిహరన్‌అర్జున్ ద్వయం కూడా పురుషుల డబుల్స్ బరిలో ఉంది. మహిళల డబుల్స్‌లో కవిప్రియసిమ్రన్, రుతుపర్ణశ్వేతపర్ణ, అశ్విని శిఖ జంటలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి.

హెడ్ భార్యకు ఆన్‌లైన్లో వేధింపులు

సిడ్నీ: ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ-ట్రావిస్ హెడ్ మధ్య మైదానంలో జరిగిన మాటల యుద్ధ ప్రభావం బయట కూడా కనిపిస్తోంది. హెడ్ భార్య జెసికాను లక్ష్యంగా చేసుకుంటూ కొందరు అభిమానులు ఆన్‌లైన్‌లో దూషణలకు దిగారు. దీనిపై జెసికా ఆందోళన వ్యక్తం చేసింది. ''నా సామాజిక మాధ్యమ ఖాతాలు దూషణలతో కూడిన కామెంట్లతో నిండిపోతున్నాయి. కొంతమంది వ్యక్తులు మా కుటుంబ సభ్యులనే కాక స్నేహితులను కూడా తిడుతూ వ్యాఖ్యలు చేస్తున్నారు. 2023 వన్డే ప్రపంచకప్ తర్వాత ఎదుర్కొన్న దూషణల పర్వానికి ఇది కొనసాగింపుగా అనిపిస్తోంది'' అని జెసికా తెలిపింది. బెంగళూరుసన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో విరాట్-హెడ్ మధ్య మాటల యుద్ధం జరిగింది. మ్యాచ్ ముగిసిన తర్వాత హెడ్‌తో కోహ్లీ కరచాలనం చేయలేదు. ఈ నేపథ్యంలో విరాట్‌కు మద్దతుగా కొందరు అభిమానులు సామాజిక మాధ్యమాల్లో హెడ్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలకు దిగుతున్నట్లు కనిపిస్తోంది.

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్‌కు దుర్గా ఈషా

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కంద్రపు దుర్గా ఈషా ఎంపికైంది. అస్సాంలోని గౌహతిలో జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో సత్తా చాటిన ఈషా.. వచ్చే నెల 26 నుంచి జపాన్‌లో జరిగే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి ఎంపికైంది.

ఫైనల్ పంచ్ ఎవరిదో!





బెంగళూరు × గుజరాత్
క్వాలిఫయర్-1 నేడు
రాత్రి 7.30 నుంచి

ఎన్నో విధ్వంసక విన్యాసాలు. ఇంకెన్నో రసవత్తర సమరాలు. కొన్ని అనూహ్య తడబాట్లు.. కొన్ని అద్భుత పోరాటాలు! దాదాపు రెండు నెలల నుంచి అభిమానులను ఉర్రూతలూగించిన ఐపీఎల్.. కీలక ఘట్టానికి చేరుకుంది. నేటి నుంచే ప్లేఆఫ్స్.

క్వాలిఫయర్-1లో మంగళవారం డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును గుజరాత్ టైటాన్స్ ఢీకొట్టనుంది. వేదిక ధర్మశాల. బెంగళూరు ఆద్యంతం నిలకడగా రాణించి అగ్రస్థానంతో ప్లేఆఫ్స్ చేరితే.. గుజరాత్ ద్వితీయార్ధంలో అద్భుతంగా పుంజుకుని రెండో స్థానంతో ముందంజ వేసింది. సమవుజ్జీలుగా కనిపిస్తోన్న ఈ రెండు జట్ల మధ్య రసవత్తర సమరం ఖాయం.

వరుసగా రెండోసారి ఐపీఎల్ విజేతగా నిలవాలనుకుంటున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక సమరానికి సిద్ధమైంది. తనలాగే బలమైన బౌలింగ్ దళం ఉన్న గుజరాత్ టైటాన్స్‌ను మంగళవారం క్వాలిఫయర్ 1లో ఢీకొట్టనుంది. లీగ్ దశలో రెండు జట్లూ 18 పాయింట్లతో నిలిచినా.. మెరుగైన రన్‌రేట్‌తో ఆర్సీబీ అగ్రస్థానం సాధించింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్తుంది. ఓడిన జట్టుకు మరో అవకాశం ఉంటుంది. ఆ జట్టు ఫైనల్లో స్థానం కోసం ఎలిమినేటర్ (రాజస్థాన్ × హైదరాబాద్) విజేతతో తలపడుతుంది.

--ఉత్సాహంగా టైటాన్స్

గుజరాత్ టైటాన్స్‌కు ఇది అయిదో ఐపీఎల్ సీజన్ మాత్రమే. కానీ ఈ కొద్ది కాలంలోనే ఆ జట్టు లీగ్‌పై తనదైన ముద్ర వేసింది. స్థిరమైన ప్రదర్శనతో ఆకట్టుకున్న టైటాన్స్.. తన తొలి సీజన్ (2022)లోనే ఛాంపియన్‌గా అవతరించింది. మొత్తంగా గత నాలుగేళ్లలో ఒక్కసారి మినహా ప్రతిసారీ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. టైటాన్స్ ఈ సీజన్‌లోనూ అదరగొట్టింది. ఆరంభంలో కాస్త తడబడ్డా.. టోర్నమెంట్ సాగుతున్న కొద్దీ ఆ జట్టు జోరందుకున్న తీరు అద్భుతం. వరుస విజయాలతో జీటీ ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది. బలమైన బౌలింగ్ ఎటాక్, టాప్ ఆర్డర్ సూపర్ బ్యాటింగ్ ఆ జట్టు టాప్2లో నిలవడానికి ప్రధాన కారణాలు. సూపర్ ఫామ్‌లో ఉన్న టాప్ ఆర్డర్.. ఒత్తిడికి గురైన సందర్భాలు చాలా తక్కువ. ఓపెనర్లు సుదర్శన్ (638), శుభ్‌మన్ (616)లు అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో తొలి రెండు స్థానాల్లో ఉండడం విశేషం. వాళ్లు తమ జట్టుకు నిలకడగా శుభారంభాలనిస్తున్నారు. మూడో స్థానంలో బట్లర్ (469) కూడా విలువైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. టాప్3 మరోసారి చెలరేగితే తమకు తిరుగుండదని గుజరాత్ భావిస్తోంది. అయితే ఆ జట్టు మిడిల్ ఆర్డర్ మెరుగుపడాలి. బౌలింగ్ టైటాన్స్‌కు కొండంత బలం. 24 వికెట్లు పడగొట్టిన రబాడ.. టోర్నీలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా భువనేశ్వర్ సరసన ఉన్నాడు. రబాడ, సిరాజ్ (17 వికెట్లు)ల ద్వయం కొత్త బంతితో నిలకడగా వికెట్లు పడగొడుతోంది. ప్రసిద్ధ్ (14 వికెట్లు) కూడా రాణిస్తున్నాడు. రషీద్ ఖాన్ (19 వికెట్లు) మధ్య ఓవర్లలో ప్రత్యర్థి జట్లను నియంత్రిస్తున్నాడు. తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 89 పరుగుల తేడాతో చెన్నైని చిత్తు చేసిన గుజరాత్.. మంచి ఊపు మీదుంది.

--ముందంజ ఇలా.. బెంగళూరు ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌ల్లో 9 విజయాలు, 5 పరాజయాలతో 18 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఒకే ఒక్కసారి మాత్రమే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. మరోవైపు గుజరాత్ ద్వితీయార్ధంలో ఊపందుకుంది. తొలి ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు ఓడిపోయి, ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడ్డట్లు అనిపించిన ఆ జట్టు.. తర్వాతి ఏడు మ్యాచ్‌ల్లో ఆరు గెలిచి పాయింట్ల పట్టికలో టాప్2లోకి దూసుకొచ్చింది. ఆ జట్టు ఓ దశలో వరుసగా అయిదు మ్యాచ్‌లు నెగ్గడం విశేషం.

--ముఖాముఖిలో..

రికార్డు పరంగా చూసినా బెంగళూరు, గుజరాత్‌లు సమవుజ్జీలే. ఐపీఎల్‌లో ఇప్పటివరకు ఎనిమిది సార్లు తలపడ్డ ఈ రెండు జట్లు చెరో నాలుగు మ్యాచ్‌ల్లో నెగ్గాయి. ఈ సీజన్‌లో పోటీపడ్డ రెండు మ్యాచ్‌ల్లో చెరోసారి పైచేయి సాధించాయి. ఏప్రిల్ 24న జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో నెగ్గగా.. ఏప్రిల్ 30న తలపడ్డ పోరులో జీటీ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

--ఆర్సీబీ నిలకడగా..

దశాబ్దాన్నర నిరీక్షణ అనంతరం నిరుడు తొలిసారి ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన బెంగళూరు.. ఈసారి కూడా అదే ఫామ్‌ను కొనసాగించింది. ఈ సీజన్‌లో పరిపూర్ణమైన జట్లలో ఆర్‌సీబీ ఒకటి. బయటి మ్యాచ్‌ల్లో, హోరాహోరీ మ్యాచ్‌ల్లో గెలవగలిగే సామర్థ్యం ఆర్సీబీని ఈ సీజన్లో అత్యంత నిలకడైన జట్లలో ఒకటిగా మార్చింది. రజత్ పాటీదార్ నేతృత్వంలోని ఆర్సీబీ దూకుడైన బ్యాటింగ్, గత సీజన్ల కన్నా ఆధారపడ దగ్గ బౌలింగ్ దళంతో చక్కని విజయాలు అందుకుంది. ఈ డిఫెండింగ్ ఛాంపియన్.. అదిరే బ్యాటింగ్‌తో అనేక సార్లు 200పై స్కోర్లు సాధించింది. టాప్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లీ మంచి ఫామ్ ఆ జట్టుకు గొప్ప సానుకూలాంశం. కోహ్లీ 14 మ్యాచ్‌ల్లో 50.63 సగటు, 163.82 స్ట్రైక్‌రేట్‌తో 557 పరుగులు సాధించాడు. ఇందులో ఒక శతకం, నాలుగు అర్ధశతకాలు ఉన్నాయి. అతడు మరోసారి చెలరేగాలని ఆర్సీబీ కోరుకుంటోంది. 433 పరుగులు సాధించిన పడిక్కల్ కూడా అదరగొడుతున్నాడు. ఇంకా టిమ్ డేవిడ్ (277), సాల్ట్ (202), కృనాల్ పాండ్య (182)లతో ఆర్సీబీ లైనప్ బలంగా కనిపిస్తోంది. ఆలస్యంగా అవకాశాలు దక్కించుకున్న వెంకటేశ్ అయ్యర్ (75 సగటుతో 158 పరుగులు) కూడా బ్యాటుతో ఆకట్టుకున్నాడు. అయితే సాల్ట్ గాయం నుంచి కోలుకోకపోతేనే అతడు తుది జట్టులో ఉంటాడు. ఇక బంతితో భువనేశ్వర్ సూపర్ ఫామ్ బెంగళూరు ధీమాను పెంచుతోంది. ఇప్పటివరకు అతడు కేవలం 8.07 ఎకానమీ రేట్‌తో 24 వికెట్లు పడగొట్టాడు. హేజిల్‌వుడ్ (12 వికెట్లు), రసిఖ్ సలామ్ (14 వికెట్లు), కృనాల్ పాండ్య (11) వికెట్లు కూడా చక్కని బౌలింగ్‌తో ఆర్సీబీ విజయాల్లో తమ వంతు పాత్ర పోషించారు. ప్రత్యర్థిని కట్టడి చేసే సామర్థ్యం బెంగళూరు బౌలింగ్ దళానికి ఉంది.

--తుది జట్లు (అంచనా)....

బెంగళూరు: రజత్ పాటీదార్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్/వెంకటేశ్ అయ్యర్, దేవ్‌దత్ పడిక్కల్, జితేశ్ శర్మ, రొమారియో షెపర్డ్, టిమ్ డేవిడ్, కృనాల్ పాండ్య, భువనేశ్వర్, హేజిల్‌వుడ్, రసిఖ్ సలామ్.

గుజరాత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, సుందర్, హోల్డర్, తెవాతియా, నిశాంత్ సింధు, రషీద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, రబాడ, సిరాజ్, సాయికిశోర్/మానవ్ సుతార్.

--24..... ఈ ఐపీఎల్‌లో భువనేశ్వర్ వికెట్లు. అతనే సీజన్ నంబర్‌వన్ బౌలర్. 14 మ్యాచ్‌ల్లో 18.5 సగటు నమోదు చేశాడు. రబాడ కూడా 14 మ్యాచ్‌ల్లో ఇన్నే వికెట్లు సాధించాడు. అతడి సగటు 20.54.

--638..... ఐపీఎల్ 19లో సాయి సుదర్శన్ పరుగులు. అతనే అగ్రస్థానంలో ఉన్నాడు. గిల్ 616 పరుగులతో రెండో స్థానంలో ఉండగా.. బెంగళూరు తరఫున కోహ్లీ (557) నంబర్‌వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు.

ఈ ఐపీఎల్‌లో పవర్‌ప్లేలో గొప్పగా బౌలింగ్ చేసిన జట్లలో ఆర్సీబీ, గుజరాత్ ఉన్నాయి. జీటీ పవర్‌ప్లేలో 24.53 సగటు, 8.76 ఎకానమీ రేట్‌తో 30 వికెట్లు చేజిక్కించుకుంది. ఆర్సీబీ 28.50 సగటు, 9.50 ఎకానమీ రేట్‌తో 28 వికెట్లు పడగొట్టింది.

--పిచ్ ఎలా ఉందంటే..

ధర్మశాలలో పిచ్ బ్యాటర్లకు బాగా అనుకూలిస్తుంది. ఈ సీజన్‌లో ఇక్కడ రాత్రి జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఛేదించిన జట్లే పైచేయి సాధించాయి. హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం స్టేడియంలో ఔట్ ఫీల్డ్ చిన్నది. లక్ష్యాలను కాపాడుకోవడం కష్టమే .





నిశేష్ సంచలనం

ఏడో సీడ్ ఫ్రిట్జ్‌కు షాక్

జకోవిచ్, స్వైటెక్ ముందంజ

నిశేష్ బసవారెడ్డి.. ఈ పేరు చూస్తే అతను తెలుగువాడని అర్థమైపోతుంది. కాకపోతే పుట్టింది, పెరిగింది అమెరికాలో. ఈ టెన్నిస్ ఆటగాడు ప్రాతినిధ్యం వహిస్తోంది కూడా ఆ దేశానికే. ఈ కుర్రాడి పేరు ఫ్రెంచ్ ఓపెన్‌లో మార్మోగిపోయింది. తెలుగు సంతతికి చెందిన ఈ కుర్రాడు.. ప్రస్తుత అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాళ్లలో ఒకడైన టేలర్ ఫ్రిట్జ్‌కు షాకిచ్చి సంచలనం రేపాడు. పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో సంచలనం నమోదైంది. తెలుగు మూలాలున్న నిశేష్ బసవారెడ్డి అదిరే ప్రదర్శన చేశాడు. టోర్నీలో ఎలాంటి అంచనాలు లేకుండా, అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన నిశేష్.. ఏడో సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌ను ఇంటిముఖం పట్టించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో అతడు 76 (75), 76 (75), 67 (911), 61తో ఫ్రిట్జ్ ఆట కట్టించాడు. దాదాపు మూడున్నర గంటలు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ఆరంభం నుంచే ఫ్రిట్జ్‌కు 21 ఏళ్ల నిశేష్ గట్టి పోటీ ఇచ్చాడు. తొలి రెండు సెట్లను టైబ్రేకర్‌లో గెలుచుకున్న అతడు.. మూడో సెట్లోనూ ఆధిక్యంలో నిలిచాడు. కానీ ఫ్రిట్జ్ పుంజుకుని టైబ్రేకర్‌లో సెట్ గెలిచాడు. కానీ నాలుగో సెట్లో ఫ్రిట్జ్ పూర్తిగా తేలిపోయాడు. ప్రత్యర్థికి ఒకటే గేమ్ కోల్పోయిన నిశేష్.. తేలిగ్గా సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. మ్యాచ్‌లో నాలుగు ఏస్‌లు కొట్టిన నిశేష్.. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేశాడు. అతను 51 విన్నర్లు కొట్టాడు. 5 డబుల్‌ఫాల్ట్స్, 48 అనవసర తప్పిదాలు చేసిన ఫ్రిట్జ్ ఓటమి కొనితెచ్చుకున్నాడు. 2000 ఫ్రెంచ్ ఓపెన్లో నికోలాస్ కీఫెర్ (8వ ర్యాంకు)ను జాన్ గాంబిల్ ఓడించిన తర్వాత.. రొలాండ్ గారోస్‌లో టాప్10 ర్యాంకు ఆటగాడిపై గెలిచిన అమెరికా ప్లేయర్ నిశేషే.

రెండో రౌండ్లో నొవాక్: 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురి పెట్టిన సెర్బియా దిగ్గజ ఆటగాడు నొవాక్ జకోవిచ్ రెండో రౌండ్లో ప్రవేశించాడు. తొలి రౌండ్లో మూడో సీడ్ జకోవిచ్ 57, 75, 61, 64తో పెరికార్డ్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. తొలి సెట్లో పెరికార్డ్ నుంచి నొవాక్‌కు గట్టిపోటీ ఎదురైంది. పన్నెండో గేమ్‌లో జకోవిచ్ సర్వీస్ బ్రేక్ చేసిన పెరికార్డ్ సెట్ గెలుచుకున్నాడు. అక్కడ నుంచి నొవాక్ పుంజుకున్నాడు. ప్రత్యర్థికి ఎక్కువ అవకాశం ఇవ్వకుండా వరుసగా మూడు సెట్లు గెలిచి విజయాన్ని సాధించాడు. మ్యాచ్‌లో నొవాక్ 12 ఏస్‌లు, 45 విన్నర్లు కొట్టాడు. కెరీర్‌లో చివరి ఫ్రెంచ్ ఓపెన్ ఆడుతున్న స్టాన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) కథ తొలి రౌండ్లోనే ముగిసింది. అతడు 36, 63, 36, 46తో జాంగ్ (నెదర్లాండ్స్) చేతిలో కంగుతిన్నాడు. ఎనిమిదో సీడ్ డిమెనార్ (ఆస్ట్రేలియా) 64, 64, 62తో సామ్యూల్ (బ్రిటన్)పై, తియాఫో (అమెరికా) 63, 67 (57), 64, 63తో స్పిజిరి (అమెరికా)పై గెలిచారు. బెరిటిని (ఇటలీ), నకషిమా (అమెరికా), జోడర్ (స్పెయిన్), కరెనో బస్టా (స్పెయిన్) తొలి రౌండ్లో విజయాలు సాధించారు.

స్వైటెక్ జోరు: నాలుగుసార్లు ఛాంపియన్ ఇగా స్వైటెక్ (పోలెండ్) శుభారంభం చేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఈ మూడో సీడ్ 61, 62తో జోన్స్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేసింది. ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన స్వైటెక్.. 17 విన్నర్లు కొట్టింది. రెండో సీడ్ రిబకినా (కజకిస్థాన్) 62, 62తో ఎర్‌జావిచ్ (స్లొవేనియా)పై, ఏడో సీడ్ స్విటోలినా (ఉక్రెయిన్) 36, 61, 76 (103)తో బాండర్ (హంగేరి)పై, పావోలిని (ఇటలీ) 75, 63తో యస్ట్రెంస్కా (ఉక్రెయిన్)పై గెలిచారు. అనిసిమోవా (అమెరికా), మెర్టిన్స్ (బెల్జియం), కసత్కినా (ఆస్ట్రేలియా), పొటపోవా (ఆస్ట్రియా) తొలి రౌండ్ దాటారు.

మూలాలు నెల్లూరులో.. నిశేష్ తల్లిదండ్రులు సాయి ప్రసన్న, మురళీకృష్ణలది ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు. 1999లోనే వీరు అమెరికా వలస వెళ్లారు. నిశేష్ కాలిఫోర్నియాలో పుట్టాడు. 2022 యుఎస్ ఓపెన్లో ఒజాన్ (అమెరికా) జతగా అతడు.. జూనియర్ బాలుర డబుల్స్ టైటిల్ గెలిచాడు. 2025 యుఎస్ ఓపెన్‌తో గ్రాండ్‌స్లామ్ అరంగేట్రం చేసిన అతడు.. గత ఏడాది యుఎస్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్లో తొలి రౌండ్లోనే నిష్క్రమించాడు. ఈ సీజన్లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్ చేరిన నిశేష్.. తాజాగా ఫ్రెంచ్ ఓపెన్లో తొలి రౌండ్లోనే సంచలన విజయాన్ని నమోదు చేశాడు.